


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162


మీకు అధికారం కావాల్సింది.. అందుకేనా?: జగన్‌కు దేవినేని ఉమా సూటి ప్రశ్న




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 100 | శుక్రవారం 10 - 04 -2026 | పేజీలు : 12 | వెల-3


## మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్



**భారీగా పోలింగ్ శాతం నమోదు అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాంతం**

అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఇసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం

**21 నెల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం**
**జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయి**
**విభజన కన్నా జగన్ వల్లనే ఏపి నష్టపోయింది**
**'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు**
**బాపట్ల జిల్లా సూరేపల్లిలో పట్టా పుస్తకాలు అందచేత**

# ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం





చేయాల్సింది పాదయాత్ర కాదు...

## ఆత్మవిమర్శన యాత్ర




ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తన సోదరుడు జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి చారిత్రాత్మక పాదయాత్ర చేపట్టి నేటికి 23 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, జగన్ విధానాలను, వైఎస్సార్ ఆశయాలను పోలుస్తూ షర్మిల సూటి ప్రశ్నలతో విరుచుకుపడ్డారు. తండ్రి పేరును పార్టీలో పెట్టుకుని, ఆయన ఆశయాలకు పూర్తిగా వ్యతిరేకంగా జగన్ పనిచేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "ఇవాళ ఏప్రిల్ 9! సరిగ్గా 23 సంవత్సరాల క్రితం మన తండ్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి గారు, అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో పాదయాత్ర అనే మహాయజ్ఞం మొదలుపెట్టారు. పేదల బాగు కోసం, బడుగుల మంచి కోసం, సకల జనుల సంక్షేమ మహాయాగానికి

## వైఎస్సార్ మరణం వెనుక జగన్ హస్తం నిజమే అనిపిస్తోంది



వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నేటి పరిస్థితులు చూస్తుంటే... వైఎస్ రాజశేఖర రెడ్డి మరణం వెనుక జగన్ హస్తం ఉందంటూ గతంలో వ్యక్తమైన అనుమానాలు నిజమేనని నమ్మాల్సి వస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. పదవీ వ్యామోహంతో జగన్ ఒక సైకోలా ప్రవర్తిస్తున్నారని, ఆయన నైజం చూస్తుంటే నాడు బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు వాస్తవమే అనిపిస్తోందని అన్నారు. ఒక వ్యక్తి ప్రవర్తన వల్ల కుటుంబం, సమాజం ఎలా నాశనమవుతాయో చెప్పడానికి జగన్ ఒక ఉత్తమ ఉదాహరణ అని అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఇవాళ మీడియా సమావేశంలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, "2009లో వైఎస్సార్ హెలికాప్టర్ ప్రమాదానికి గురైనప్పుడు రాష్ట్రమంతా ఆందోళనలో ఉంది. కానీ, ఆ సమయంలో జగన్ ఇతర రాష్ట్రాల్లో ఉండాల్సిన అవసరం ఏమొచ్చింది? వైఎస్ మరణవార్త నిర్ధారణ కాకముందే ముఖ్యమంత్రి పదవి కోసం సంతకాల సేకరణ చేపట్టాల్సిన తొందర ఎందుకు వచ్చింది? వైఎస్ మరణం వెనుక జగన్ హస్తం ఉందని నాడు ప్రస్తుత వైసీపీ నేత బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను మేం నమ్మలేదు.

## జగన్‌కు రాజకీయ పరిణతి లేదు:

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విషయంలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కీలక వ్యాఖ్యలు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పాల్గొన్న ఆయన... రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు.రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడుస్తున్నా, ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటికీ ఒక శాశ్వత రాజధాని లేకపోవడం దురదృష్టకరమని



## అంబటి రాంబాబుపై గుంటూరులో కేసు నమోదు

మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుపై గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరులోని ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన వ్యవహారంలో ఆయనపై అరండల్ పేట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదయింది. ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఆందోళనలు నిర్వహించారనే ఆరోపణలపై గుంటూరు పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. ఘటన వివరాల్లోకి వెళితే..



## వైఎస్ గురించి ఎందుకు మాట్లాడుతారు అమరావతి గురించి మాట్లాడుకోండి



**అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు అహంకారపూరితం మండిపడ్డ మాజీమంత్రి బొత్స సత్యనారాయణ**

వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు దిగజారి మాట్లాడుతున్నా రని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు ఖండించడానికి తాను మీడియా ముందుకు రాలేదన్నారు. ఆయన వ్యాఖ్యలు అహంకార పూరితంగా ఉన్నాయని బొత్స అభివర్ణించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తనకు మధ్య ఎంతో అనుబంధం ఉందని ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ గుర్తు చేసుకున్నారు. గురువారం రాజధాని అమరావతిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో బొత్స సత్యనారాయణ విశాఖపట్నంలో స్పందించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర రెడ్డిని గుర్తు చేసుకుని బొత్స తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. టీడీపీపై గతంలో మీరు ఏమన్నారో మర్చిపోయారా అంటూ అచ్చెన్నాయుడును ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోయిన తర్వాత.. తాను, తన భార్య పావురాల గుట్టకు వెళ్లామని పేర్కొన్నారు. కావాలంటే రాజధాని అమరావతిపై మాట్లాడండి.. అంతేకానీ ఏమిటి ఈ మాటలు? అంటూ అచ్చెన్నాయుడిని బొత్స నిలదీశారు. చనిపోయిన వ్యక్తి గురించి ఎందుకు మాట్లాడతారు? అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజకీయాలు కోసం ఇంత దిగజారుడా.. ఇదేమి రాజకీయం అంటూ సీఎం చంద్రబాబును బొత్స ప్రశ్నించారు.

## రాజశేఖరరెడ్డి పాదయాత్రకు 23 ఏళ్లు..



దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్రకు నేటితో (ఏప్రిల్ 9) 23 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, వైసీపీ అధినేత జగన్ తన తండ్రి స్మృతులను నెమరువేసుకున్నారు. ఎక్స్ వేదికగా ఆయన భావోద్వేగంతో కూడిన ఒక ట్వీట్ చేశారు. 2003 ఏప్రిల్ 9వ తేదీన ఎర్రటి ఎండలో వైఎస్సార్ మొదలుపెట్టిన పాదయాత్ర కేవలం ఒక ప్రయాణం కాదని, అది రాష్ట్ర రాజకీయ చరిత్రనే తిరగరాసిన అపూర్వ ఘట్టమని జగన్ కొనియాడారు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు సాగిన ఆ యాత్ర, జన హృదయాల్లో 'నేనున్నాననే భరోసా' నింపిందని గుర్తుచేశారు.

## సోషల్ మీడియాకు కట్టడి ఉండాల్సిందే



మంత్రి నారా లోకేశ్ స్పష్టీకరణ

# ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం

ప్రజలకు సుపరిపాలన అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని..దానిని నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. 21 నెలల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. ఎన్నికల్లో చెప్పనివి కూడా అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని సీఎం విమర్శించారు.గురువారం భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో పర్యటించిన సీఎం.. 'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. విభజన కంటే వైసీపీ పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో మహిళలకు రక్షణ లేదన్నారు. జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయని.. దారిలో పెడుతున్నామని వెల్లడించారు. వైసీపీ హయాంలో ప్రజల భూములపై కన్నేశారని.. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో భూ వివాదాలకు తెరలేపారని మండిపడ్డారు. 'పట్టా పుస్తకంపై జగన్ ఫొటో వేసుకున్నారు.. ఆస్తి మీది.. ఫొటో ఆయనది' అని విమర్శించారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. గత పాలకులు చేసిన పనులు చూసి తనకే మతిపోయిందని సీఎం అన్నారు. నూటికి 90శాతం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చేవన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతినెలా 9న ఒక ప్రాంతంలో రైతులకు పాస్ పుస్తకాలు అందిస్తామని.. జులై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని వెల్లడించారు. 2027 మార్చి నాటికి కోటి 12లక్షల పాస్ పుస్తకాలు అందిస్తామని వెల్లడించారు. ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా రికార్డులు మారుస్తున్నామని చెప్పారు. రైతులకు ఇస్తున్న పాస్ పుస్తకాలను ఎవరూ తారుమారు చేయలేరన్నారు. కరెన్సీకి వాడే టెక్నాలజీని పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడామని తెలిపారు. అధికారంలోకి రాగానే ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. 22ఏ నుంచి మీ భూములు తొలగిస్తామని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. భూ రిజిస్ట్రేషన్ల పద్ధతిలో కూడా మార్పులు తీసుకొస్తామన్నారు. తల్లిని కోర్టుకు ఈడ్చిన వ్యక్తి మనకు ఆదర్శం కాకూడదని సీఎం అన్నారు. సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. భూమి నుంచి వచ్చే ఆదాయమే కాకుండా.. సముద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం ఇష్టానుసారం అప్పులు చేసిందని.. ప్రతి దానిపైనా అప్పులు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేకపోయిందన్నారు. ఆనాడు హైదరాబాద్‌ను డెవలప్ చేశానని.. ఇప్పుడు అమరావతిని నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. అన్నీ ఆలోచించే రాజధానికి అమరావతి పేరు పెట్టానని స్పష్టం చేశారు. 'ప్రజా రాజధాని.. దేవతల రాజధాని.. అమరావతి' అని పేర్కొన్నారు. ఆనాడు బాబాయ్‌ని చంపి.. ఆ నేరం తనపై వేశారని సీఎం మండిపడ్డారు. అమరావతిపై జగన్ కక్షగట్టారని.. ఆనాడు ఆడబిడ్డలను వేధించారన్నారు. డ్రోన్లతో ఆడబిడ్డలను వీడియోలు తీశారని, లాఠీలతో కొట్టించారని గుర్తుచేశారు. అమరావతి విషయంలో న్యాయం, ధర్మం, చట్టం గెలిచిందన్నారు. ప్రాంతాలు, కులాలతో రాజకీయం చేస్తే గెలవలేమని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు జగన్ ఒక్కడే సైకో అనుకున్నామని.. వైసీపీ నేతలంతా సైకోలుగా మారారని వ్యాఖ్యానించారు. 'నీలాంటి వెయ్యి మంది సైకోలు వచ్చినా అమరావతి ఆగదు' అని స్పష్టం చేశారు. అధికారంలో ఉంటే విధ్వంసం చేశారని... ప్రతిపక్షంలో ఉంటే బెదిరిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేయాలనుకుంటే.. దాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.

## మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

ప్రకటించింది. గురువారం ఉదయం అసోం (126), కేరళం (140), పుదుచ్చేరి (30) లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఈ ఎన్నికల పోలింగ్ వేళ.. ఏర్పాట్లను ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. మొత్తం 296 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కేరళ, పుదుచ్చేరిలలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా.. అస్సాంలో ఐదు గంటలకే పూర్తయ్యింది. మూడు ప్రాంతాల్లోనూ ఈసారి భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలోని 140 నియోజకవర్గాల్లో 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ బూత్‌లకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5గంటల వరకు 75శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి స్వల్పంగా పెరిగింది. అస్సాంలో 126 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 5గంటల వరకు 84శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగింది. దల్‌గావ్‌లో అత్యధికంగా 94.57శాతం పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలోనూ భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం 30 అసెంబ్లీ స్థానాలుండగా.. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. ఐదు గంటల వరకే 86శాతం పోలింగ్ నమోదు కాగా.. ఇది మరింత పెరగనుంది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ.. అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్‌లలో ఉన్నవారికి టోకెన్లు ఇచ్చి పోలింగ్‌కు అనుమతించినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చి రెండో వారంలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23వ తేదీన ఒక దశలో ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొంది. మే 4వ తేదీన ఈ ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు పక్రియ చేపట్టడతామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

## జగన్‌కు రాజకీయ పరిణతి లేదు: బీవీ రాఘవులు

రాఘవులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వైఫల్యానికి సంబంధించి ఒకవైపు సీఎం చంద్రబాబు, మరోవైపు మాజీ సీఎం జగన్ ఇద్దరూ సిగ్గుపడాలని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాజధాని అభివృద్ధికి జరుగుతున్న కృషికి అందరూ సహకరించాలని కోరారు. జగన్‌కు రాజకీయ పరిణతి లేదని రాఘవులు నేరుగా విమర్శించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఏదో ఒకటి మాట్లాడాలన్నట్టుగా వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. మొన్నటి వరకు 'మూడు రాజధానులు' అంటూ కాలక్షేపం చేసిన జగన్, ఇప్పుడు ఆ అంశాన్ని పక్కనపెట్టి 'మావిగన్' అంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి ఒక రాజధాని ఏర్పడుతున్న తరుణంలో అందరూ ఆనందించి, తోడ్పాటు అందించాలి తప్ప, అడ్డుతగిలేలా మాట్లాడటం రాజకీయ నాయకులకు తగదని చురకలు అంటించారు.

## అంబటి రాంబాబుపై గుంటూరులో కేసు నమోదు

ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కొన్ని కథనాలకు నిరసనగా నిన్న గుంటూరులోని ఆ పత్రిక కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. శాంతియుత నిరసనకు పోలీసులు అనుమతి ఇచ్చినప్పటికీ, అది ఉద్రిక్తంగా మారింది. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసుకుంటూ ముందుకు వెళ్లడం, విధుల్లో ఉన్న పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో, గుంటూరులోని అరండల్ పేట పోలీస్‌స్టేషన్‌లో అంబటి రాంబాబుతో పాటు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, అంబటి మురళి సహా పలువురు వైసీపీ నేతలపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు ఫైల్ చేశారు. మరోవైపు, నెల్లూరులో మరో మాజీ మంత్రి కాకాణిపై కూడా పోలీసు కేసు నమోదయింది.రాష్ట్రవ్యాప్తంగా ఏబీఎన్ కార్యాలయాల వద్ద వైసీపీ చేపట్టిన నిరసనలు ఉద్రిక్తతలకు దారితీయడం, వరుసగా మాజీ మంత్రులపై కేసులు నమోదు కావడం ఇప్పుడు సంచలనం రేపుతోంది. మీడియా స్వేచ్ఛను అడ్డుకుంటున్నారని కూటమి నేతలు విమర్శిస్తుండగా, తమ నాయకుడిపై తప్పుడు కథనాలు రాస్తున్నారని వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## రాజశేఖరరెడ్డి పాదయాత్రకు 23 ఏళ్లు..

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఉచిత విద్యుత్ ఫైల్‌పై తొలి సంతకం చేసి, రైతన్నలను రాజులుగా నిలబెట్టిన ఘనత వైఎస్సార్‌దేనని జగన్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యేలా చేయడంతో పాటు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో పేదలకు ప్రాణదాతగా నిలిచారని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పోలవరం పనుల వేగవంతం ద్వారా రాష్ట్ర రూపురేఖలను ఆయన మార్చేశారని వివరించారు. వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా, తన తండ్రి బాటలోనే ప్రజల కోసం తన ప్రయాణం నిరంతరం కొనసాగుతుందని జగన్ స్పష్టం చేశారు.

## వైఎస్ గురించి ఎందుకు మాట్లాడుతారు అమరావతి గురించి మాట్లాడుకోండి

తానెప్పుడూ పదవుల కోసం పాకులాడలేదని బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు బాధాకరమన్నారు. వైఎస్ మరణంపై అచ్చెన్నాయుడు దిగజారి విమర్శలు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా బొత్స భావోద్వేగానికి గురయ్యారు. వైఎస్‌తో తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని తెలిపారు. తన మంత్రి పదవితో అచ్చెన్న ప్రజలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. రాజకీయాల్లో గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలన్నారు. జగన్‌పై రాజకీయ విమర్శలు ఎన్నైనా చేయండని.. వైఎస్ఆర్ మరణం ప్రస్తావన తీసుకురావడం అప్రస్తుతమని తెలిపారు. కావాలంటే పాత వీడియో క్లిప్పింగులు చూసుకోవచ్చన్నారు. మావిగన్ నచ్చకపోతే అమరావతే కావాలని చెప్పండని తెలిపారు.

## పెద్ద ముప్పును తప్పించే హెచ్‌పీవీ టీకా

### విజయవంతంగా ముందుకెళ్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమం

### ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలో కార్యక్రమం ఏర్పాటు

### కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ

ఒక్క టీకా పెద్ద ముప్పును తప్పిస్తుందని.. హెచ్‌పీవీ టీకా కార్యక్రమం విజయవంతంగా ముందుకెళ్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ అన్నారు. గురువారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ.. రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తదితరులతో కలిసి ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీని సందర్శించారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం అమలు తీరుతెన్నులను పరిశీలించారు. అదేవిధంగా కార్యక్రమంపై స్థానికుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. సర్వైకల్ క్యాన్సర్ దేశంలో ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా ఉందని.. సమయానికి టీకా వేయడం ద్వారా ఇది పూర్తిగా నివారించగల వ్యాధి అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిర్దిష్ట మార్గదర్శకాల ఆధారంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం చురుగ్గా జరుగుతోందని వివరించారు. దేశంలోని బాలికలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును బహుమతిగా అందించేందుకు ఈ బృహత్తర కార్యక్రమం అమలవుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణ, అడిషనల్ డైరెక్టర్ డా. సుబ్రమణెశ్వరి, జేడీ డా. రమేష్, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు. ఇకపోతే దేశంలో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని.. వివిధ స్థాయుల్లో సమగ్ర, నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు వైద్య పరిశోధనలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది.

## ఆరోగ్య స్పృహ, వ్యాధుల గుర్తింపు పరీక్షలు

### సకాలంలో చికిత్స తీసుకునేలా ప్రోత్సహించడం

### గొల్లపూడి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సందర్శించిన కేంద్రకార్యదర్శి

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ గురువారం గొల్లపూడిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించి.. ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య స్పృహ, వ్యాధుల గుర్తింపు పరీక్షలు, సకాలంలో చికిత్స తీసుకునేలా ప్రోత్సహించడం వంటి సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. టీబీ వ్యాధి నిర్ధారణకు అనుసరిస్తున్న విధానాలతో పాటు టీబీ ముక్త్ భారత్ అభియాన్ – 100 రోజుల ప్రచార కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన పోర్టబుల్ ఎక్స్‌రే వ్యవస్థను పరిశీలించారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజలు తేలిగ్గా ఎక్కడెక్కడికో వెళ్లనవసరం లేకుండా తమకు దగ్గర్లోనే పరీక్షలు చేయించుకునేందుకు వీలవుతుంది. అనంతరం నిక్షయ్ మిత్ర చొరవ ద్వారా క్షయ రోగులకు పోషకాహార కిట్లను అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలను అనుసంధానం చేస్తూ దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ప్రజలకు సత్వర నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. 2024, డిసెంబర్‌లో ప్రారంభమైన రెండో విడత ఇంటెన్సి÷డ్ టీబీ ముక్త భారత్ అభియాన్ ద్వారా గణనీయమైన ఫలితాలు సాధించామని.. ప్రపంచవ్యాప్తంగా టీబీ తగ్గుదల రేటుతో పోలిస్తే భారత్‌లో టీబీ కేసులు, మరణాల తగ్గుదల రెట్టింపు వేగంతో కొనసాగుతున్నట్లు వివరించారు. డేటా విశ్లేషణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో దేశవ్యాప్తంగా టీబీ ముప్పు అధికంగా ఉన్న 1,58,000 గ్రామాలు, పట్టణ వార్డులను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టీబీ ముక్త్ భారత్ యాప్ – నిక్షయ్ ద్వారా రోగులు, వైద్య నిపుణులకు సరైన మార్గనిర్దేశర అందుతోందని చెప్పారు. ఏఐ చాట్‌బాట్ ద్వారా రోగులకు తక్షణ సహాయం అందించడం జరుగుతోందని.. టీబీ రోగులకు పౌష్టికాహారం, సామాజిక మద్దతు అందించడంలో నిక్షయ్ మిత్ర కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. టీబీని ప్రారంభ దశలోనే గుర్తించి, పూర్తి చికిత్స తీసుకోవడం ద్వారా పౌష్టికాహారం, మానసిక స్థైర్యంతో టీబీపై విజయం సాధించవచ్చని పుణ్య సలిలా శ్రీవాస్తవ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (సెంట్రల్ టీబీ డివిజన్) రఘురామ్ రావు, అడిషనల్ డైరెక్టర్ డా. సుబ్రమణెళ్యేశ్వరి, జేడీ (ఎన్‌టీఈపీ) డా. రమేష్, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల ప్రకటనపై దుష్ప్రచారాలు

### వదంతులు నమ్మవద్దన్న తెలంగాణ ఇంటర్ బోర్డు

తెలంగాణ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని సోషల్ మీడియాలో తెగ వార్తలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. తాజాగా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యాశాఖ ఖండించింది. ఈ ప్రచారం అసత్యం, అందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. ఇంటర్ ఫలితాలు ప్రకటన నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే విడుదలవుతాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. గతంలో ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ మొదటి వారంలో రిలీజ్ కాలేదన్న విషయం గుర్తు చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ పెట్టింది. గతంలో ఇంటర్ ఫలితాలు విడుదలైన తేదీలు.. 2014 మే 3, 2015 – ఏప్రిల్ 22, 2016 – ఏప్రిల్ 22, 2017 – ఏప్రిల్ 16, 2018 – ఏప్రిల్ 13, 2019 –ఏప్రిల్ 18, 2020 – జూన్ 18 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2021–జూన్ 28 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2022 – జూన్ 28, 2023 – మే 9, 2024 – ఏప్రిల్ 24, 2025 –ఏప్రిల్ 22 ప్రకటించారు' అని పోస్ట్ చేశారు. ఇక జవాబు పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాలను బట్టి ఫలితాల విడుదల అయ్యే తేదీలు ప్రతి ఏటా మారుతుంటాయి. అదే విధంగా, ఈ సంవత్సరం కూడా కొనసాగుతుంది. మూల్యాంకన సమయాన్ని బట్టి, ఫలితాల విడుదల ప్రకటన చేస్తారు. ఇంటర్మీడియట్ ఫలితాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా విద్యాశాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరుతున్నాము. సామాజిక మాధ్యమాలలో ప్రచారమయ్యే తప్పుడు వార్తలను నమ్మ వద్దని తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ పేర్కొంది.

## మీకు అధికారం కావాల్సింది.. అందుకేనా?: జగన్‌కు దేవినేని ఉమా సూటి ప్రశ్న

విజయవాడ, ఏప్రిల్ 09: వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావు మరోసారి నిప్పులు చెరిగారు. గురువారం విజయవాడలో దేవినేని ఉమామహేశ్వరరావు విలేకర్లతో మాట్లాడుతూ.. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి పరదాలు కట్టుకుని తిరిగారని.. తాడేపల్లి ప్యాలెస్ దాటి బయటకు రాలేదంటూ జగన్ ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఐదేళ్లు పరిపాలన చేసి రాష్ట్రాన్ని ఏం ఉద్ధరించరంటూ జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. మళ్లీ అధికారం కోసం అర్రులు చాస్తున్నారని మండిపడ్డారు.ప్రజా వేదిక విధ్వంసంతో మొదలైన అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌కు మంచి నీరు ఇవ్వడానికి కూడా చేతులు రాలేదంటూ జగన్ తీరును ఎండగట్టారు. ఐదేళ్ల విధ్వంస పాలనలో అడ్డగోలుగా చేసిన అవినీతి బయటకు తీయటానికే సగం మంది అధికారులకు సరిపోతుందని వ్యంగ్యంగా అన్నారు. లిక్కర్ దోపిడీలో రూ. వేల కోట్ల దోపిడి కారణంగా మీతో కలిసి పని చేసిన ప్రజా ప్రతినిధులు, అధికారులు జైళ్లలో మగ్గుతున్నారని చెప్పారు పేదవాడికి పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్లు సైతం ఆపేశారని గుర్తు చేశారు. అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధానిగా గెజిట్ నోట్ విడుదలైతే తట్టుకోలేక రాజధానిపై విషం చిమ్ముతున్నారంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో వైసీపీ తప్ప అన్ని పార్టీలు అమరావతికి మద్దతు తెలిపాయని ఈ సందర్భంగా దేవినేని ఉమా గుర్తు చేశారు. హంద్రీనీవా, గాలేరు–నగరి, గండికోట ద్వారా రాయలసీమ చివరి ప్రాంతంలోని భూములకు సైతం నీళ్లు వెళుతుంటే ఒక్క మంచి మాట కూడా మాట్లాడలేక పోతున్నారంటూ వైసీపీ నేతల వైఖరిపై నిప్పులు చెరిగారు.

## చేయాల్సింది పాదయాత్ర కాదు... ఆత్మవిమర్శన యాత్ర:

నాడు ఆయన శ్రీకారం చుట్టారు. ఆయన ఈ పాదయాత్ర ఒక కాంగ్రెస్ సైనికునిగా, నాయకునిగా, పీసీసీ అధ్యక్షునిగా ప్రారంభించారు. ఆ తర్వాత అయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చి ముఖ్యమంత్రిగా చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. మరి అటువంటి తండ్రికి కుమారునిగా, పార్టీ పేరులో ఆయన పేరును పొందుపర్చి మీరు నేడు చేస్తున్నది ఏమిటి? ఆజన్మాంతం పేదలు, దళితులు, మైనారిటీలు, మహిళలు, రైతులు, ఎస్టీలు, వీరి కోసం తపించి, తన పాలనలో వీరికోసం ఎన్నో పథకాలను రచించిన ఆయన ఎక్కడ, నేడు ఫాసిస్టు శక్తులకు తలవంచి వాళ్ళ క్యాపిటలిస్టు పోకడలకు దాసోహం అయిన మీరెక్కడ? లౌకికవాదాన్ని తన ఊపిరిలో నింపుకుని, అన్ని వర్గాలవారిని సమానంగా ఆదరించి, ప్రజల ఐక్యత కోసం పాటుపడింది వైఎస్సార్, మరి అయన తనయునిగా మీరు నేడు చేస్తున్నది ఏమిటి? మతోన్మాద బీజేపీ దగ్గర కేసులకు, రాజకీయ భవిత కోసం భయపడి మోకరిల్లడం. ఇది ఎంత వరకు ధర్మం? బీజేపీ ప్రతి చర్యలో దళిత, మైనారిటీ వ్యతిరేక పోకడలు ఉన్నాయ్. వక్ఫ్ చట్టం అయితేనేమి, దళిత క్రిస్టియన్ రిజర్వేషన్లు ఐతేనేమి, ఎఫ్ సీఆర్ఏ చట్టం అయితేనేమి, బుల్ డోజర్ రాజకేయాలితేనేమి. వీటన్నిటికి గల్లీలో మౌనం వహించి, ఢిల్లీలో బేషరతు మద్దత్తు ప్రకటించిన మీరా ఆయనకు నివాళి అర్పించేది ఇవాళ? ఆయనబతికుంటే ఇవి హర్షించేవారా? ఇది ఆయన ఆదర్శాలకు, అభిమతాలు పూర్తి వ్యతిరేకం కదా? ఇక మీ ఐదేళ్ల పాలనలో సభ్యసమాజం సిగ్గుపడేలా దళితుల మీద, మహిళల మీద జరిగిన దాడులు, చివరికి మైనార్టీల మీద కూడా జరిగిన అక్రమాలు, ఇవన్నీ రాజశేఖర రెడ్డిగారి ఆత్మ క్షోభించే పనులు కాదంటారా? అణువణువునా రాజశేఖర రెడ్డిగారి పాలనకు, ఆలోచనలకూ భిన్న ధ్రువంగా ఉంటూ మీరు ఇవాళ అయన పాదయాత్రను తల్చుకుని నివాళులు అర్పించడం హాస్యాస్పదంగా ఉంది. మొన్న ప్రకటించినట్టు మీరు చేయాల్సింది పాదయాత్ర కాదు, ఆత్మవిమర్శన యాత్ర" అంటూ షర్మిల పేర్కొన్నారు.

## వైఎస్సార్ మరణం వెనుక జగన్ హస్తం నిజమే అనిపిస్తోంది

కానీ, ఇప్పుడు జగన్ నైజం, ఆయన ప్రవర్తన చూస్తుంటే అవే నిజమేమో అనిపిస్తోంది" అని అన్నారు. తండ్రి బతికి ఉంటే తాను సీఎం కాలేనని భావించిన జగన్, ఆయనను మానసిక క్షోభకు గురిచేశారని, అందుకే వైఎస్సార్ ఆయన్ను రాష్ట్రానికి దూరంగా బెంగళూరు పంపించారని స్వయంగా రోశయ్యే చెప్పిన విషయాన్ని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు."పదవీ వ్యామోహం ఉంటే సైకోలు తండ్రి, తల్లి, చెల్లి, బాబాయి అని కూడా చూడరని జగన్‌ను చూస్తే అర్థమవుతోంది. తండ్రి మరణంతో వచ్చిన సింపతీతో పార్టీ పెట్టి, 2014లో సీఎం అయ్యేందుకు ప్రయత్నించారు. 2019లో అధికారం కోసం సొంత బాబాయిని అత్యంత దారుణంగా హత్య చేయించి, ఆ సానుభూతితోనే గెలిచారు. వివేకాను ఎవరు చంపారో రాష్ట్రంలో చిన్న పిల్లాడిని అడిగినా చెబుతారు. ఇప్పుడు సొంత తల్లి, చెల్లే ఆయన అసలు నైజాన్ని బయటపెడుతున్నారు. తండ్రి ఇచ్చిన మాట నిలబెట్టమని అడిగిన కన్నతల్లినే ఇంట్లోంచి బయటకు పంపిన చరిత్ర జగన్‌ది" అని అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. జగన్ నిలకడలేని వ్యక్తిత్వానికి నిలువుటద్దమని, ఆయనో రాజకీయ సైకో అని అచ్చెన్న అభివర్ణించారు. "సీఎం పదవి కోసం కాంగ్రెస్‌పై దాడి చేశారు, బెయిల్ కోసం సోనియా కాళ్ల మీద పడ్డారు. అమరావతికి అంగీకరించి, అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులంటూ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టారు. ఇప్పుడు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడంతో 'మావిగన్' అంటూ కొత్త నాటకానికి తెరలేపారు. జిల్లాల మధ్య తగువులు పెట్టే ఈ ప్రతిపాదనను చూసి వైసీపీ నేతలే నవ్వుకుంటున్నారు" అని ఎద్దేవా చేశారు. ఉత్తరాంధ్రకు గత టీడీపీ ప్రభుత్వం ఏం చేసిందో కాలికి గజ్జె కట్టుకుని వివరిస్తానని సవాల్ విసిరారు. "అధికారంలో ఉన్న ఐదేళ్లు ఉత్తరాంధ్రకు ఏం చేశారని ఇప్పుడు మావిగన్ అంటున్నారు? పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. తన తల్లిలాంటి భువనేశ్వరి గారిని, అమరావతి మహిళలను, చివరికి కన్నచెల్లి షర్మిళ క్యారెక్టర్‌ను కూడా కించపరిచేలా మాట్లాడించిన జగన్‌కు ఆడవాళ్ల గురించి మాట్లాడే హక్కు లేదు. రాష్ట్ర ప్రజలకు జగన్ పిచ్చి చేష్టలు పూర్తిగా అర్థమయ్యాయి. ఆయన ఇక ఎప్పటికీ అధికారంలోకి రాలేరు. సమాజానికి పట్టిన చీడ పురుగు లాంటి జగన్, తన పదవి కోసం ఎంతమందిని పొట్టన పెట్టుకున్నారో ప్రజలు గుర్తుంచుకోవాలి" అని అచ్చెన్నాయుడు అన్నారు.

## సోషల్ మీడియాకు కట్టడి ఉండాల్సిందే

మారుతున్న కాలంలో సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. దాని దుష్ప్రభావాల నుంచి భావి తరాలను కాపాడుకోవాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ బాధ్యత ప్రభుత్వంపైనా ఉందని నారా లోకేశ్ స్పష్టం చేశారు. పిల్లల డిజిటల్ భద్రత, మహిళల గౌరవంపై మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'పిల్లల మానసిక వికాసం దెబ్బతినకుండా ఉండేందుకు సోషల్ మీడియాలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలన్నారు. 13 నుంచి 16 ఏళ్ల వయసు పిల్లలకు కేవలం వారి ఎదుగుదలకు, విద్యకు ఉపయోగపడే కంటెంట్ మాత్రమే అందుబాటులో ఉండేలా విధివిధానాలను రూపొందించాలి. సోషల్ మీడియాను వేదికగా చేసుకొని విద్వేషాలను చిమ్మేవారిని ఉపేక్షించేది లేదు. మహిళల పట్ల అవమానకరంగా ప్రవర్తించినా, అశ్లీల లేదా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసినా కఠినమైన చర్యలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాలు, అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న డిజిటల్ సేఫ్టీ చట్టాలను అధ్యయనం చేసి, ఆంధ్రప్రదేశ్‌లో అత్యుత్తమ విధానాన్ని అమలు చేయాలి. పిల్లలను సోషల్ మీడియా దుష్ప్రభావాలకు దూరం చేయడం ఇప్పుడు అనివార్యం. వారి సృజనాత్మకతను కాపాడుతూనే, సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని అన్నారు.

# కొత్తబురుజులో ఇంటింటికీ శుద్ధజలానికి శ్రీకారం





## రూ.30 లక్షలతో నల్లా కనెక్షన్ల పనుల ప్రారంభం

### సీఎం హామీ అమలు దిశగా వేగంగా అడుగులు

### స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

### హార్టికల్చర్‌తో రైతులకు అధిక ఆదాయం అవకాశాలు

### 100 రోజుల ప్రణాళికతో నీటి భద్రతకు చర్యలు

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**డోన్/నంద్యాల, ఏప్రిల్ 09(నంది పత్రిక):-** డోన్ మండలం కొత్తబురుజు గ్రామంలో ఇంటింటికీ శుద్ధజలాన్ని అందించే లక్ష్యంతో కొళాయి కనెక్షన్ల పనులను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం కొత్తబురుజు గ్రామంలో జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనులను డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డితో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత నెల 9వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రామ పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు ఈ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి, జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదం కలుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా, స్వచ్ఛ భారత్ మిషన్ కింద మరుగుదొడ్లు లేని 30 మంది లబ్ధిదారులకు రూ.4.5 లక్షలతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించామని తెలిపారు. ఈ చర్యలతో గ్రామంలో పరిశుభ్రత పెరగడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు బలం చేకూరుతుందని అన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన గతంలో కోరిన ఆరు పనులను ఇప్పటికే మంజూరు చేశామని, అవి సకాలంలో పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. మిగిలిన పనులను కూడా వారం నుంచి పది రోజుల్లో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్, చెరువులు, ఫీడర్ ఛానల్స్ అభివృద్ధి వంటి పనులు పూర్తయితే భూగర్భ జలమట్టం పెరిగి అందరికీ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలంతా ఐక్యంగా సహకరించాలని పిలుపునిచ్చారు.

**హార్టికల్చర్ రైతులకు బంగారు భవిష్యత్** జిల్లాలో సుమారు 7 లక్షల ఎకరాల్లో సాగవుతున్న సాధారణ పంటల ద్వారా రూ.4,000 కోట్ల ఆదాయం వస్తుండగా, కేవలం 49 వేల హెక్టార్లలో సాగవుతున్న ఉద్యానవన పంటల ద్వారా రూ.7,000 కోట్ల ఆదాయం లభిస్తోందని తెలిపారు. ఇందులో డోన్ నియోజకవర్గం కీలక పాత్ర పోషిస్తోందని వెల్లడించారు. రైతులు హార్టికల్చర్ పంటలపై దృష్టి సారిస్తే మరింత లాభదాయకంగా ఉంటుందని సూచించారు.

**100 రోజుల ప్రణాళికతో నీటి భద్రత** నియోజకవర్గంలోని ప్రతి చెరువును నింపడం, ఫీడర్ ఛానల్స్ శుభ్రపరచడం వంటి పనులకు ప్రాధాన్యతనిస్తూ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. బోరు బావులపై ఆధారపడే రైతులకు నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.లి

**ప్రజల సహకారమే అభివృద్ధికి మూలం** గ్రామాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే ఆరోగ్యవంతమైన, అభివృద్ధి చెందిన గ్రామాన్ని నిర్మించగలమని కలెక్టర్ పిలుపునిచ్చారు. డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించడం కోసం కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేర్చుతామని, నీటి కొరత సమస్యను పూర్తిగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పెన్షన్లు, ఇళ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. అలాగే, డ్రిప్ ఇరిగేషన్ మరియు స్ప్రింక్లర్ పద్ధతులను తిరిగి ప్రవేశపెట్టి నీటి వినియోగాన్ని తగ్గిస్తూ రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.



# రాయలసీమ హక్కులపై 12 ఏళ్లుగా సాగుతున్న మోసం




## మూడు ప్రభుత్వాలపై బొజ్జా దశరథరామిరెడ్డి ఘాటు విమర్శలు

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 9 ( నంది పత్రిక )** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో రాయలసీమకు హామీ ఇచ్చిన హక్కులను గత 12 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న మూడు ప్రభుత్వాలు అమలు చేయకపోవడం కేవలం నిర్లక్ష్యం కాదు.. ఇది స్పష్టమైన ద్రోహం అని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.గురువారం నంద్యాల పట్టణంలోని సమితి కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది.

**ఈ సందర్భంగా బొజ్జా మాట్లాడుతూ..** విభజన చట్టంలో పేర్కొన్న ప్రత్యేక ప్యాకేజీతో పాటు తెలుగుగంగ, గాలేరునగరి, హంద్రీనీవా, వెలుగొండ వంటి సాగునీటి ప్రాజెక్టులు, కడప ఉక్కు కర్మాగారం, గుంతకల్లు రైల్వే జోన్, అనంతపురంలో ఎయిమ్స్ వంటి హామీలు అన్నీ కేవలం ఎన్నికల నినాదాలుగానే మిగిలిపోయాయని, ఒక్క అడుగు కూడా ముందుకు వేయని పాలకుల వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. అలగనూరు రిజర్వాయర్ నుంచి గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మత్తులు, గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం వరకు అన్ని ప్రాజెక్టులు ప్రకటనలకే పరిమితమైపోయాయని, పుష్కర కాలంగా రాయలసీమ ప్రజలను మభ్యపెట్టడమే ప్రభుత్వాల పని అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమను పూర్తిగా వనరుల దోపిడి కేంద్రంగా మార్చి, నీరు, అటవీ సంపద, ఖనిజాలను ఇతర ప్రాంతాలకు తరలించేసి ఈ ప్రాంతాన్ని నిర్వీర్యం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల పేరుతో రైతుల భూములను స్వాధీనం చేసుకుని, వ్యవసాయం మీద ఆధారపడిన రైతులు, కూలీలు, కౌలు రైతులను ఉపాధి లేకుండా చేస్తూ, ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు తరలించడం అత్యంత దారుణమని మండిపడ్డారు. కోస్తా ప్రాంతంలో పండిన వరి పంటను కనీస మద్దతు ధరకు భారీ స్థాయిలో కొనుగోలు చేపడుతున్న ప్రభుత్వాలు, అదే సమయంలో ప్రభుత్వ సూచనల మేరకు వరికి ప్రత్యామ్నాయంగా రాయలసీమలో పండిస్తున్న చిరుధాన్యాలు, పప్పు దినుసులను కనీస మద్దతు ధరకు సేకరించడంలో స్పష్టమైన వివక్ష చూపుతున్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. “రాయలసీమకు హక్కులు కాగితాలపైనేడ అమలులో మాత్రం సున్నా” అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.రాష్ట్ర విభజన చట్టం ప్రకారం పదేళ్లు హైదరాబాద్‌ను రాజధానిగా కొనసాగించాల్సి ఉన్నప్పటికీ, ఆగమేఘాల మీద రాజధాని మార్పిడి చేసి రాష్ట్రాన్ని అప్పుల కూపంలోకి నెట్టారని, దీనికి అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ సమానంగా బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు.“రాయలసీమకు న్యాయం చేయకుండా రాజధాని అభివృద్ధి పేరుతో నాటకాలు ఆపాలి” అని ఆయన హెచ్చరించారు.

**సమితి కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ..**అమరావతి రాజధాని పేరుతో కొత్త హామీలు ఇస్తున్న ప్రభుత్వాలు ముందుగా రాజధాని ఆదాయంలో రాయలసీమ వాటా ఎంత?రాజధానిలో రాయలసీమ వాసులకు ఎన్ని ఉద్యోగాలు?రాజదానిలో రాయలసీమ నిరుద్యోగులకు ఉపాధి, వ్యాపారాల కోసం ఎంత భూమి కేటాయింపు?

అనే అంశాలను స్పష్టంగా ప్రకటించి, పార్లమెంట్ ద్వారా చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు ఈ ద్రోహంపై మౌనం పాటించడం, రాయలసీమ సమాజం నిశ్శబ్దంగా ఉండడమే దీనికి కారణమని పేర్కొంటూ, ఇకపై ప్రజలను చైతన్యపరిచే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో భారీ స్థాయిలో ఆందోళనలు, కార్యక్రమాలు చేపట్టి రాయలసీమ హక్కుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

ఈ సమావేశంలో చెరుకూరి వెంకటేశ్వర నాయుడు, బెక్కెం రామసుబ్బారెడ్డి, బాలీశ్వరరెడ్డి, సంజీవ, రామనాగిరెడ్డి, రెడ్డి జాఫర్, చంద్రశేఖర్, యుగంధర్, ఎంసీ కొండారెడ్డి, మనోజ్, దశరథరామ్, శివరాంరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎర్రం శంకర రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త!



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 9 :** శక్తి యాప్ గురించి విద్యార్థినిలలో అవగాహన కల్పించేందుకు పోలీస్ యంత్రాంగం కృషి చేస్తూ ఉంది. ఈ విషయంలో జిల్లా పోలీసు అధికారులు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి గ్రామాలలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ ఉన్నారు. నేరస్తుల పట్ల, అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని మెత్తగా హెచ్చరికలు జారీ చేస్తూ ఉన్నారు. నంద్యాల జిల్లా ఎస్పీ షోరాన్, అడిషనల్ ఎస్పీ మంద జావలి ఆదేశాల మేరకు బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్న పాడు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల నందు పోలీసులు సదస్సును నిర్వహించారు. శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, రఫీ, మహిళా పోలీస్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు ఎమర్జెన్సీ కాల్ 112 గురించి నోట గురించి వివరించారు. గుర్తుతెలియని అపరిచిత వ్యక్తులతో అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఎవరైనా వ్యక్తులు ఏదైనా తినుబండారాలు ఇస్తే వాటిని తినరాదని పేర్కొన్నారు. అమ్మాయిలు పట్ల ఎవరైనా వ్యక్తులు చెడుగా ప్రవర్తించినట్లయితే తల్లిదండ్రులకు కానీ సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులకు తెలుపాలన్నారు. లేనిపక్షంలో 112 కు ఫోన్ చేయాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. శక్తి యాప్ గురించి వివరించి యాప్ ను డౌన్లోడ్ చేయించి విద్యార్తినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.



# సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి: కలెక్టర్

### విధులకు గైర్హాజరు అయితే కఠిన చర్యలు

### ఆన్‌లైన్ హాజరు లోపాలపై షోకాజ్ నోటీసులు

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల/బేతంచర్ల, ఏప్రిల్ 09(నంది పత్రిక):-** సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు సేవలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. గురువారం బేతంచెర్ల మండలం ఆర్. కొత్తపల్లె గ్రామంలోని స్వర్ణ గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ హాజరు నమోదును పరిశీలించారు. విధులకు హాజరుకాని పంచాయతీ గ్రేడ్-5 సిబ్బంది మరియు వీఆర్వోపై షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సిబ్బంది ఎవరెవరు ఏ విధులు నిర్వహిస్తున్నారనే అంశంపై కలెక్టర్ వివరణ కోరారు. సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లను సమగ్రంగా పరిశీలించి, వాటి నిర్వహణపై సూచనలు ఇచ్చారు. సచివాలయ ఆవరణలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పబ్లిక్ పర్సెప్షన్ సర్వేలో సాధించిన పురోగతి, ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు, వాటిపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారా లేదా అనే అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రీసర్వేకు సంబంధించి వీఆర్వో, సర్వేయర్ అందుబాటులో లేరని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన సచివాలయ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే ప్రజా ఫిర్యాదుల విభాగం పనితీరును కూడా కలెక్టర్ సమీక్షించారు.

# రుద్రవరం మండల తహసీల్దార్‌గా నాగవీణ బాధ్యతల స్వీకారం

**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 9 (నంది పత్రిక):** రుద్రవరం మండల నూతన తహసీల్దార్‌గా నాగవీణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ధోని ఆల్ఫ్రెడ్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ కావడంతో, ఆయన స్థానంలో మంగళగిరిలోని భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ కార్యాలయం నుండి నాగవీణను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ, కార్యాలయంలో నిరంతరం అందుబాటులో ఉంటూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు రెవెన్యూ అధికారులు మరియు సిబ్బంది ఆమెను కలిసి అభినందనలు తెలిపి, ఘనంగా సన్మానించారు.



నంది

శుక్రవారం 10 - 04 -2026

# ఏబీఎన్ ఆర్కే వ్యాఖ్యలపై వైసీపీ సమరభేరి..





## ఆర్కేపై తిరగబడ్డ వైసీపీ.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు! మహిళల గౌరవాన్ని కించపరిచారంటూ నేతల ఆగ్రహం. రాధాకృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్. వైసీపీ నేతల హెచ్చరిక: "రాధాకృష్ణ.. ఖబడ్దార్!"

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 9 ( నంది పత్రిక )** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అధినేత వేమూరి రాధాకృష్ణపై వైసీపీ నేతలు నిప్పులు చెరిగారు. 'వీకెండ్ కామెంట్ బై ఆర్కే' కార్యక్రమంలో మహిళలను, వైసీపీ కార్యకర్తలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నైతిక విలువలు వదిలేసి, సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించిన ఆర్కేతో పాటు ఏబీఎన్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పచ్చ పార్టీకి వంత పాడుతూ.. జర్నలిజం ముసుగులో నీచమైన రాజకీయాలు చేస్తున్నారంటూ ఏబీఎన్ ఆర్కేపై వైసీపీ నేతలు విరుచుకుపడ్డారు. ఈ నెల 4వ తేదీన ప్రసారమైన 'వీకెండ్ కామెంట్ బై ఆర్కే' ప్రోగ్రామ్‌లో మహిళలను కించపరిచేలా, అత్యంత అసహ్యకరమైన వ్యాఖ్యలు చేశారంటూ నంద్యాల రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ అస్రార్ బాషాకు ఫిర్యాదు చేశారు ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మరియు పార్టీ నేతలు. జగన్ మోహన్ రెడ్డి చెబితే.. సొంత భార్యలను కూడా చెల్లెళ్లుగా భావించే వెన్నెముక లేని బ్యాచ్ అంటూ ఆర్కే చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలు కేవలం ఒక పార్టీని విమర్శించడం మాత్రమే కాదని.. మహిళా లోకాన్ని, కట్టుకున్న భార్యలను అవమానించడమేనని నేతలు మండిపడ్డారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మరియు వైసీపీ నేతలు మాట్లాడుతూ.. "రాధాకృష్ణకు అసలు సంస్కారం ఉందా? నీకు తల్లి, చెల్లి, భార్య లేరా? రాజకీయ విమర్శలు చేయాలంటే నీతిగా చేయాలి. అంతేకానీ, వైసీపీ కార్యకర్తల భార్యల గురించి అంత నీచంగా మాట్లాడతారా? జర్నలిజం పేరుతో నువ్వు చేస్తున్నది అరాచకమని ఫైర్ అయ్యారు. వెంటనే ఆర్కేపై, ఆ ఛానల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి. మరోసారి నోరు జారితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.. ఖబడ్దార్!"అని హెచ్చరించారు. ఈ నెల 4వ తేదీన ప్రసారమైన 'వీకెండ్ కామెంట్ బై ఆర్కే' ప్రోగ్రామ్‌లో పాల్గొన్న యాంకర్, ఎడిటర్ మరియు మేనేజ్‌మెంట్ అందరినీ బాధ్యులను చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు పట్టుబట్టారు. మహిళలను కేవలం వస్తువులుగా చిత్రీకరిస్తూ, లింగ సమానత్వాన్ని దెబ్బతీసేలా ఆర్కే ప్రసంగాలు ఉన్నాయని వారు ఆరోపించారు. బాధ్యతాయుతమైన జర్నలిజం స్థానంలో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న ఏబీఎన్ వైఖరిపై రాష్ట్రవ్యాప్త నిరసనలకు సిద్ధమవుతున్నామని వైసీపీ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం పరిశీలకుడు పిపి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ రత్నబాబు చౌదరి, స్టేట్ లీగల్ సెల్ స్పోక్ పర్సన్ తిమ్మారెడ్డి,రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ శశికళ రెడ్డి,స్టేట్ లీగల్ సెల్ సెక్రటరీ శ్రీనివాసులు,జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, జిల్లా వైసిపి అధికార ప్రతినిధి అనిల్ అమృత రాజ్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, జిల్లా వైసీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, జిల్లా వైసీపీ మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు కారు రవికుమార్, జిల్లా వైసీపీ సెక్రటరీలు శివ నాగిరెడ్డి, దేవానగర్ బాషా,జిల్లా ఎంఫ సెల్ అధ్యక్షులు తిరుపతయ్య, నంద్యాల అసెంబ్లీ వైసిపి లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ,సాయిరాం రెడ్డి, నంద్యాల అసెంబ్లీ ఎస్టి సెల్ అధ్యక్షుడు రామచంద్రుడు, నంద్యాల అసెంబ్లీ దూదేకుల సంఘం మహిళా అధ్యక్షురాలు హుస్సేనమ్మ, ఫైసీపీ కార్యకర్తలు, వైసీపీ శ్రేణులు పెద్దయెత్తున పాల్గొన్నారు

# ఆలమూరు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు....



**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 09 (నంది పత్రిక):** మండలంలోనిఆలమూరు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి డాక్టర్ నాగ ప్రసన్న ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి గొల్లపాములేటి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటులో భాగంగా ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అధికారి డాక్టర్ నాగ ప్రసన్న మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దటిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో ప్రజలకు త్రాగునీటికి ఇబ్బంది లేకుండా ముందస్తుగా చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజు ఇంటింటి చెత్తసేకరణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి పాములేటి నిఆదేశించారు. ఈ కార్యక్రమంలోశిలబోయిన చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు పత్తిబ్రహ్మయ్య. టిడిపి నాయకులు పత్తి బాచేపల్లి నారాయణ . పత్తిలక్ష్మీనారాయణ. ఉపాధి హామీ సహాయకుడు గురప్ప మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.



# బ్రహ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందంటే! అబ్దుల్ ఖాదర్ పోరాట పటిమే...






**బద్వేల్ ఏప్రిల్ 09నంది పత్రిక :** బద్వేలు నియోజకవర్గంలో ప్రజానీకానికి సాగునీరు తాగునీరు అందించే బ్రహ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందంటే! అబ్దుల్ ఖాదర్ పోరాట పటిమే నని..నమ్మిన సిద్ధాంతం కోసం తన జీవిత కాలాన్ని పణంగా పెట్టి కుటుంబం కంటే పార్టీయే ముఖ్యమని పనిచేసిన అరుదైన నేత అబ్దుల్ ఖాదర్.. కడప జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన వారిలో ఒకరైన కామ్రేడ్ జి. అబ్దుల్ఖాదర్ భారత కమ్యూనిస్టు పార్టీ కడప జిల్లా సీనియర్ నాయకులు కామెడీ అబ్దుల్ ఖాదర్ సంస్మరణ సభ గురువారం ఆయన స్వగృహం దగ్గర సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అధ్యక్షతన జరిగినది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ...1936 జులై 17 వ తేదీన కలసపాడు మండలోని గౌష్ భీ,. అబ్దుల్ రెహామాన్ దంపతులకు జన్మించిన జి. అబ్దుల్ ఖాదర్ 1958 లో వివాహం అనంతరం పోరుమామిళ్ళకు వచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాధిస్తున్న వీరోచిత పోరాటాలు ఆనచివేత, దోపిడి, అంటరాని తనానికి వ్యతిరేకంగా ప్రజలకు అండగా నిలిచి కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడైన అబ్దుల్ ఖాదర్ 1960 లో సిపిఐ ప్రాథమిక సభ్యత్వాన్ని స్వీకరించి, ప్రజా సమస్యలపై స్పందిస్తూ, పేద ప్రజలకు అండగా నిలవడంతో, ఉద్యమ ప్రస్థానాన్ని మొదలు పెట్టి సిపిఐ సోరుమామిళ్ళ మండల కార్యదర్శిగా, బద్వేల్ ఏరియా కార్యవర్గ సభ్యునిగా, ఏరియా కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పని చేశారు. ప్రజలు వారి పోరాటానికి గుర్తించి గ్రామ పంచాయితీ వార్డు మెంబర్, 11 సంవత్సరాలు గ్రామ ఉపసర్పంచ్గా ఎన్నుకోన్నారు. ఆయన ప్రజలకు సేవచేశారు. నిత్యం కరువు వలసలు ఆత్మహత్యలకు నిలయంగా మారిన రాయలసీమ తగినంత వర్షపాతం లేక, కరువు నాతన పడుతున్న రాయలసీమ రైతాంగం నీటివెతలు, తీరాలాంటే కృష్ణా జలాలు రాయలసీమకు మళ్ళించాలని సాగిన స్త్రీ వీరోచిత పోరాటాలు అబ్దుల్ ఖాదర్ లాంటి వారి ఆలోచనలకు పదును పెట్టి కడప జిల్లా నీటి కష్టాలు భౌగోళిక పరిస్థితు లు, నీటి అవసరాలను గుర్తించి గ్రామ గ్రామానికి నీటి పారుదల ప్రాజెక్టుల అవసరాన్ని ప్రజలకు వివరించి ఉద్యమాలకు ఉసిగొల్పడంలో ప్రముఖ పాత్ర పోషించారు. గాలేరు నగరిలో అంతర్భాగమైన గండికోట ప్రాజెక్టు సాద్యం కాదన్న పాలకుల కుట్రలు, కుతంత్రాలను ఛేదిస్తూ కడప జిల్లా కలెక్టరెట్ కేంద్రంగా చేసుకొని ప్రాణాలను పణంగా పెట్టి సిపిఐ సీనియర్ నాయకుడు కామ్రేడ్ జె. వెంకట్రామిరెడ్డి (జె.వి) గారితో కలిసి అబ్దుల్ ఖాదర్ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. వీరి పోరాటాన్ని గుర్తించిన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గండికోట ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసారు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతం, అధిక సంఖ్యలో అణగారిన వర్గాలు కలిగిన బద్వేల్ నియోజకవర్గంలో చెప్పుకో దగ్గ ప్రాజెక్టు గానీ, పరిశ్రమలు లేక గల్ఫ్ దేశాలకు వలస పోతున్నారని వలసలు నివారించాలంటే బద్వేలు నియోజక వర్గంలోని ప్రతి గ్రామానికి త్రాగునీరు, ప్రతీ ఎకరాకు సాగునీరు, అందించేందుకు తెలుగు గంగాలో అంతర్భాగమైన బ్రహ్మం! సాగర్ పూర్తి చేసి పోరుమామిళ్ళ బద్వేలు చెరువులకు అనుసందానం నుంచి అట్లూరు చివరి ఆయుకట్టు వరకు నీరు అందించాలని బ్రహ్మం సాగర్ నుండి పోరుమామిళ్ళ వరకు జరిగిన పది రోజుల పాదయాత్రలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి మండవ వెంకటేశ్వరరావు బ్రహ్మం సాగర్ పర్యటన సందర్భముగా జరిగిన ఉద్యమంలో లాఠి చార్జీలు అరెస్టు జైళ్ళ లెక్కచేయకుండా పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారు. అబ్దుల్ ఖాదర్ జీవితంలో ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు వెంటాడిన, నమ్మిన సిద్ధాంతాల కోసం ఏమాత్రం సదలకుండా అచంచలమైన విశ్వాసంతో 66 సంవత్సరరాల ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగించిన నిరాడంబరతకు నిస్వార్థానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన కామ్రేడ్ జి అబ్దుల్ ఖాదర్ కి జోహర్లు.. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎండి విజయ జ్యోతి మాట్లాడుతు...చిన్ననాటి నుంచి ఆయన పోరాటాలను నేను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఇలాంటి నాయకుల యొక్క ప్రోత్సాహాన్ని అనుభవాన్ని తీసుకున్నానని నిరంతరం పేదల కోసం పనిచేసే కమ్యూనిస్టు పార్టీలు జరగాలని రాబోవు రోజుల్లో కాంగ్రెస్ కమ్యూనిస్టులు కలిసి ఉపాధి హామీ చట్టంపై సమిష్టి పోరాట నిర్వహిస్తామని ఆమె తెలిపారు మాజీ జెడ్పిటిసి సభ్యులు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ.... అని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రభాకర్, ఎస్ టి యు జాతీయ నాయకులు రమణారెడ్డి మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు బ్రహ్మానందరెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య వీర శేఖర్, చంద్రశేఖర్,విజయలక్ష్మి బాల ఓబయ్య, వెంకట్రాముడు వేణుగోపాల్,బాదుల్లా ఏరియా సహాయ కార్యదర్శులు పి.వి రమణ, ఇమ్మానియేల్ మండల కార్యదర్శి రవికుమార్ జిల్లా సమితి సభ్యులు కోడూరు కేశవ పీరయ్య, అబ్దుల్ ఖాదర్ కుమారులు షరీఫ్, జబ్బర్ తదితరులు పాల్గొన్నారు



# బండి ఆత్మకూరులో ఆయుర్వేద వైద్య శిబిరం



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 9:** బండి ఆత్మకూరు లోని కొత్తకొట్టాల కాలనీలో గురువారం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయుర్వేద వైద్యాధికారి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో గర్భవతులు బాలింతలు పిల్లలకు వైద్య చికిత్సలు చే శామని వైద్యాధికారి తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి చవన్ ప్రాస్ సిరప్ అద్భుతంగా పనిచేస్తుందని అన్నారు. ఆర్థరైటిస్, గ్యాస్ ట్రబుల్, న్యూరో సమస్యలతో బాధపడుతున్న వారికి మందులను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. పోషకాహారం లోపం కారణంగా రక్తహీనత ఏర్పడుతుందని, తీవ్రమైన అలసట తలనొప్పి కళ్ళు తిరగడం వల్లే వేగంగా కొట్టుకోవడం ఊపిరి సరిగా ఆడక పోవడంతో పాటు చర్మం కూడా తెల్లబడుతుందని అన్నారు. రక్తం తక్కువ అయితే గర్భవతులకు ప్రమాదకరమైన పరిస్థితులు నిలబడ్డాయని పేర్కొన్నారు. రక్త పెరుగుదలకు ఆకుకూరలు పప్పు ధాన్యాలను విరివిగ తీసుకోవాలని అన్నారు. గర్భవతి అయిన ఓ మహిళను పరిశీలిస్తే, హిమగ్లోబి యన్ 14 శాతం ఉండాల్సి ఉండగా ఆమెకు 7 గ్రాములు మాత్రమే ఉందని తెలిసిందన్నారు. పైగా మహిళలకు ఇదివరకే ముగ్గురు సంతానం కలిగారని, ప్రస్తుతం కూడా గర్భవతిగా ఉండటంతో ఆమె రక్తహీనతతో బాధపడుతుందని తేలిందని అన్నారు. ఆమెను పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేయడం జరిగింది అని వైద్యాధికారి నాగరాజు వివరించారు.

# ఫార్మసిస్టు సుబ్బారావు బదిలీ

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 9 :** బండి ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న సుబ్బారావు బదిలీ అయ్యారు. ఆయనను అవుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేస్తూ వైద్య శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్మసిస్టు సుబ్బారావు బదిలీ అవుతారన్న విషయం తెలియగానే ముందే ఆయనకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాలుగేళ్ల పాటు ఫార్మసిస్టుగా పనిచేసిన సుబ్బారావు విధి నిర్వహణలో ఆయన చేసిన సేవలు మరచిపోలేనివని వైద్యాధికారులు సవిత, భావన రెడ్డిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావును వైద్య సిబ్బంది సన్మానించారు. ఫార్మసిస్టుగా పనిచేస్తున్న సుబ్బారావు సీనియర్ ఫార్మసిస్టు పదోన్నతి విభాగంలో ఉన్నారు. మరో రెండు నెలల లోనే ఆయనకు పదోన్నతి లభించే అవకాశం ఉంది. నంద్యాల జిల్లాలో జిల్లెల్ల, పేరు సోముల, టంగుటూరు, దీబగుంట్ల, మోత్కూరు, నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఫార్మసిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చిత్తూరు,కడప అనంతపురం కర్నూలు జిల్లాలలో 30 కి పైగా ఫార్మసీలో పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని తెలుస్తోంది. కొత్త రిక్రూట్మెంట్ ద్వారా ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం త్వరలోనే చర్యలు చేపట్టే అవకాశం ఉంది.



## సోషల్ మీడియాలో స్టార్.. నేరాల్లో కిలాడీ: దుబాయ్‌లో గ్యాంగ్‌స్టర్ ఇందర్జీత్ అరెస్ట్!

భారతదేశంలో మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న ఇందర్జీత్ అనే గ్యాంగ్ స్టర్ దుబాయ్ లో ఉంటూ సోషల్ మీడియాలో లక్షలాది మంది ఫాలోవర్లతో సెలబ్రిటీగా చెలామణీ అవుతున్నాడు. హర్యానా, ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో తన గ్యాంగ్ తో కార్యకలాపాలు సాగిస్తున్నాడు. భారత నిఘా సంస్థలు అందించిన పక్కా సమాచారంతో దుబాయ్ పోలీసులు ఈ గ్యాంగ్ స్టర్ ను తాజాగా అరెస్టు చేశారు.

ఇందర్జీత్‌పై భారత్‌లో హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, భూకబ్జాలు వంటి తీవ్రమైన నేరాలకు సంబంధించి 30కి పైగా కేసులు నమోదయ్యాయి. పోలీసులకు చిక్కకుండా విదేశాల్లో తలదాచుకుంటున్న ఇతడిపై భారత ప్రభుత్వం గతంలోనే ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది.

ఒకవైపు నేర సామ్రాజ్యాన్ని నడుపుతూ, మరోవైపు ఇన్‌స్టాగ్రామ్‌లో విలాసవంతమైన జీవితాన్ని ప్రదర్శించేవాడు. ఖరీదైన కార్లు, డిజైనర్ దుస్తులతో వీడియోలు పోస్ట్ చేస్తూ దాదాపు 15 లక్షల మంది ఫాలోవర్లను సంపాదించుకున్నాడు. గల్ఫ్ దేశాల్లోని వ్యాపారవేత్తలను, భారత్‌లోని బిల్డర్లను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది.

ప్రస్తుతం ఇతడిని భారత్‌కు అప్పగించే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. న్యాయపరమైన లాంఛనాలు పూర్తయిన వెంటనే అతడిని ఢిల్లీకి తరలించి విచారించనున్నారు. ఇందర్జీత్ అరెస్టుతో ఉత్తర భారతంలోని పలు నేర ముఠాల నెట్‌వర్క్‌కు గట్టి దెబ్బ తగిలినట్లయిందని పోలీసులు భావిస్తున్నారు.

## చంద్ర రాజేశ్వరరావు 32వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన,,

# సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ కే రామకృష్ణ





**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ అగ్ర నాయకులలో ఒకరు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 32 వ వర్ధంతి సిపిఐ కార్యాలయంలో ఈరోజు ఉదయం 9 గంటలకు చంద్ర రాజేశ్వరరావు ఫోటో కు దండ వేసి నివాళి అర్పించిన సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ కె రామకృష్ణ ఈ కార్యక్రమానికి సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన కామ్రేడ్ కే రామకృష్ణ మాట్లాడుతూ కృష్ణాజిల్లా మంగలాపురంలో 150 ఎకరాలు భూమి ఉన్న ఒక భూస్వామ్య కుటుంబంలో జన్మించిన చంద్ర రాజేశ్వరరావు 1914 సంవత్సరం ఏప్రిల్ 9న జన్మించిన చంద్ర రాజేశ్వరరావు విద్యార్థి దశలోని స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు డిగ్రీ వరకు కృష్ణాజిల్లాలో చదువుకొని ఉన్నత చదువుల కోసం బెనారస్ లోని హిందూ విశ్వవిద్యాలయంలో డిగ్రీలో పట్టా పొంది డాక్టర్ కోర్సు కొరకు విశాఖపట్నంలో చదువుతున్న దశలో కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితులై విద్యార్థి ఉద్యమంలో పార్టీ ఉద్యమంలో పోరాటాల్లో చురుకుగా పాల్గొని అంచలంచలుగా ఎదుగుతూ సిపిఐ జాతీయ అగ్ర నాయకులలో ఒకరిగా ఎదిగాడు 1963 లో సిపిఐ ఎం గా చీలిన దశలో దేశంలో కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా పార్టీని ఎక్కడ కూడా దెబ్బతినకుండగా పార్టీని నడిపించిన యోధుడు అని తెలంగాణ సాయుధ పోరాటంలో అగ్ర భాగాన నిలబడి నైజాం నవాబులకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాలలో 4500 మంది పార్టీ కార్యకర్తలు అమరులు అయినప్పటికీ బెదరకుండా నైజాం నవాబుల చెర నుండి 10 లక్షల ఎకరాలను భూమిని పంచిన చరిత్ర కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు కి ఉన్నదని అలాంటి యోధుడు అని ఈనాటి యువతకు పార్టీ నాయకత్వానికి ఆదర్శప్రాయుడని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కోసం పార్టీ నాయకులు యువత నడుం బిగించాలని చంద్ర రాజేశ్వరరావు కి ఉన్న యావదాస్తిని పేదలకు మరియు పార్టీ కోసం ఖర్చు చేసిన త్యాగశీలి అని ఆయన అడుగుజాడల్లో నడిపించే దానికోసం యావత్ దేశ ప్రజానీకాన్ని చంద్ర రాజేశ్వర రావు మార్గంలో నడిపించాలని ఆయన పిలుపునిచ్చారు నేడు కులం పేరుతో మతం పేరుతో ప్రాంతాల పేరుతో చిచ్చు పెడుతున్న రాజకీయ పార్టీల నాయకుల నిజస్వరూ తెలుసుకునేటట్లు పార్టీ కార్యకర్తలు ప్రజలను చైతన్య పర చాలని ఆయన పిలుపునిచరు ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ కే జగన్నాథం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునియప్ప అఖిలభారత యువజన సమాక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుగంధర్ నగర సహాయ కార్యదర్శి లు మహేష్ శ్రీనివాసరావు అఖిలభారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మహిళా సమాఖ్య జిల్లా నగర కార్యదర్శులు శ్రావణి, భారతి. నగర కార్యవర్గ సభ్యులు బిసన్న అన్వర్ విశాలాంధ్ర బ్రాంచ్ మేనేజర్ నాగరాజు సీనియర్ జర్నలిస్టు వార్త మద్దిలేటి పార్టీ కార్యకర్తలు ప్రసాదు అశోకు మరియు పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కర్నూలు సర్వజన వైద్యశాలలో అభివృద్ధి పనులను తనిఖీ చేసిన సూపరిండెంట్ కే వెంకటేశ్వర్లు





**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జి జి హెచ్ ) సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ఈరోజు ఆసుపత్రిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ఆసుపత్రి ప్రాంగణంలోని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ సందర్శించిన ఆయన, అందులోని 3వ మరియు 4వ అంతస్తుల్లో జరుగుతున్న నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న సూపరింటెండెంట్, రోగులకు త్వరితగతిన సేవలు అందించేలా పనులను వేగవంతం చేయాలని అధికారులను మరియు కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తు బ్లడ్ శాంపిల్స్ విభాగాలను తనిఖీ చేసి, శానిటేషన్ ను మరింత మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం, ఆసుపత్రిలోని డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ పనులను ఆయన తనిఖీ చేశారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. యం సి హెచ్ (మాతృ మరియు శిశు సంరక్షణ) వార్డును సందర్శించిన డాక్టర్ వెంకటేశ్వర్లు , అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వార్డుల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గర్భిణీలకు మరియు బాలింతలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు తో పాటు అడ్మినిస్ట్రేషన్ నుండి డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శివ బాల, డాక్టర్ సునీల్ ప్రశాంత్, డాక్టర్ క్లింటన్, మరియు ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# పోషణ పక్వాడ కార్యక్రమాలు ప్రారంభం..



**ఆళ్లగడ్డ (చాగలమర్రి) ఏప్రిల్ 9నందిపత్రిక** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాలు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో గురువారం ప్రభుత్వ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రత్యూష , ఐ సి డి ఎస్ సూపర్వైజర్ సుశీల ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రవేట్ మేటర్నిటీ ఆస్పత్రిలో కూడా పోషణ పక్వాడ కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ , సిడిపిఓ నుండి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ చిన్నపిల్లలకు మొబైల్ దూరంగా ఉంచాలన్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నుండి ఆహారం తెచ్చి పిల్లలకు ఇవ్వరాదని, ఇంటిలో సహజంగా చేసిన ఆహారాన్ని మాత్రమే ఇవాళ అన్నారు. చిప్స్, కురుకురే వంటి జంక్ ఫుడ్స్ కు బదులుగా శనగలు, పప్పులు, పల్లీలు, చిరుధాన్యాలతో తయారైన పాప్ కార్న్స్, పండ్లు ఆరోగ్యకరమైన స్నాక్స్ ను వినియోగించాలని సూచించారు. పౌష్టికాహారంతో పాటు సరైన సమయానికి టీకాలను వైద్య సిబ్బంది చే వేయించాలని సూచించారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల మాట్లాడుతూ పౌష్టికాహార తయారీ పోటీలను అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించాలని తెలిపారు. చిన్నపిల్లల మానసిక, శారీరక పరిపక్వత కోసం బొమ్మల తయారీ తదితర పోటీలను నిర్వహించాలన్నారు. హానికరా అలవాట్లు మార్చుకోవాలని ఆమె సూచించారు. చక్కెరకు దూరంగా ఉంచాలని జ్ఞాపక శక్తి ఆలోచన వికాసం చిన్నపిల్లలకు దెబ్బతింటాయన్నారు. చిన్నపిల్లలకు మొబైల్ ఇవ్వడం ద్వారా కంటి చూపు, మెదడు అభివృద్ధిపై చెడు ప్రభావం చూపుతుందన్నారు. ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఇవ్వాలన్నారు. దీంతో రోగ నిరోధక శక్తి పెరిగి మెదడు అభివృద్ధి చెందుతుందన్నారు. చిన్నపిల్లలను ఇంట్లో బయట ఆడుకునేందుకు వీలు కల్పించాలన్నారు. శారీరక నైపుణ్యాలు మెరుగవుతాయని తెలిపారు. ఎక్కువ సమయం చిన్న పిల్లలతో గడపాలని ఇందువల్ల వారి అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, అంగన్వాడి కేంద్రాల పరిధిలోని గర్భవతులు, కిషోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు

# వెలుగోడులో ఘనంగా నిఖా వేడుక

### ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆశీర్వాదం



**వెలుగోడు, ఏప్రిల్ 09 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలోని ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిఖా (వివాహ) వేడుక ఘనంగా జరిగింది. వెలుగోడు గ్రామానికి చెందిన నదీమ్ ఫ్యాషన్స్ షేక్ నబి రసూల్ కుమార్తె షేక్ నౌషాద్, సీపీ నగర్‌కు చెందిన కీ.శే. షేక్ ఖాజా హుస్సేన్ కుమారుడు, (మాజీ ఎంపిటిసి డా. జాకీర్ హుస్సేన్ మేనల్లుడు) సద్దాం హుస్సేన్‌ల వివాహ వేడుకను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ప్రజల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. ఈ నిఖా వేడుకకు ప్రముఖ అతిథిగా హాజరైన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సుసంపన్నంగా ఉండాలని ఆకాంక్షించారు. కుటుంబాల మధ్య స్నేహబంధం మరింత బలపడాలని, ఆయన అన్నారు. ఈ సందర్భంగా అన్నారపు శేషిరెడ్డి, ఖలీల్ ఖాన్, ఇంతియాజ్, బియ్యం మూర్తుజా, ఖతీఫ్ ఇలియాస్ తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన తహసిల్దారుగా ఫణీంద్రుడు..



**ఆళ్లగడ్డ(చాగలమర్రి) ఏప్రిల్ 9 నంది పత్రిక** చాగలమరి మండలం నూతన తహసిల్దార్ గా ఫణీంద్రుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఫుల్ అడిషనల్ చార్జి తాసిల్దారుగా విధులు నిర్వహించిన విజయ్ కుమార్ యధావిధిగా డిప్యూటీ తాసిల్దారుగా చాగలమర్రి మండల కేంద్రంలో తహసిల్దారు కార్యాలయంలో యధావిధిగా కొనసాగుతున్నారు. నూతన తాసిల్దారుగా విధుల్లో చేరిన ఫణీంద్రుడు అమరావతిలో సీ సీ ఎ ల్ఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చాగలమర్రి కి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, భూమి సర్వేలు, జనగణన, తదితర అంశాలపై సచివాలయ సిబ్బంది ద్వారా పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. వివిధ రకాల భూ సమస్యలను, రస్తా పోరంబోకు, వాగు పోరంబోకు, నదీ తీర ప్రాంతాలలోని అక్రమ తవ్వకాలు, భూ కబ్జాలపై సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులచే సర్వే నిర్వహించి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు. ఎన్నో సంవత్సరాల కాలం నుండి భూ సమస్యలతో సతమతమవుతున్న రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని ఆయన తెలిపారు.

# తహసిల్దారును ఆహ్వానించిన రెవెన్యూ సిబ్బంది..



**ఆళ్లగడ్డ(చాగలమర్రి )ఏప్రిల్ 9 నంది పత్రిక** అమరావతి నుండి రెవెన్యూ కమిషనరేట్ లో విధులు నిర్వహిస్తూ చాగలమర్రి నూతన తహసీల్దారుగా విధుల్లో చేరిన ఫణీంద్రుడు ను తాసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది గురువారం ఆహ్వానించారు. ఆహ్వానించిన వారిలో డిప్యూటీ తహసిల్దార్ విజయ్ కుమార్, మండల సర్వేయర్ దేవరాజ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్తార్, జూనియర్ అసిస్టెంట్ మౌనిక, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

# డైమండ్ డికాయిట్ సినిమా లో నంద్యాల వాసులు

**రేపు ప్రపంచ వ్యాప్తంగా సినిమా రిలీజ్..**

**నంద్యాలలో శ్రీరామ కాంప్లెక్స్ లోని ఏఆర్ లో రేపు విడుదల.**

**రేపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని థియేటర్ లలో 4 షోలు మహిళలకు ఉచితం..**



**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 9(నంది పత్రిక):-** రేపు ప్రపంచ వ్యాప్తంగా డైరెక్టర్ సూర్య యాదవ్, హీరో పార్థ గోపాల యాదవ్ కాంబినేషన్ లో విడుదలవుతున్న డైమండ్ డికాయిట్ సినిమాలో నలుగురు నంద్యాల వాసులు ఈ సినిమాలో ప్రధాన పాత్రలలో నటిస్తున్నారు. పట్టణం లోని ఒకటో వార్డు అరుంధతి నగర్ చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఏ సీ వెంకట సుబ్బయ్య, గురుభవాని ఎంపీ మధు బాబు లు, సరస్వతి నగర్ కు చెందిన పశు సంవర్ధన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సకారం, షాదిక్ నగర్ కు చెందిన మురళి కృష్ణ లు ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా రేపు పట్టణంలోని శ్రీరామ కాంప్లెక్స్ లో ఉన్న ఏ ఆర్ థియేటర్లో విడుదల కానుంది. గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ సినిమా అన్ని థియేటర్లలో 4 షోలు మహిళలకు ఉచితంగా అవకాశం ఇవ్వడం విశేషం.

# పరిసరాల శుభ్రత- ఆరోగ్య భద్రత జిల్లా మలేరియా అధికారి మనోరమ



**బద్వేల్,ఏప్రిల్ 9 (నంది పత్రిక ):**పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటామని, జిల్లా మలేరియా అధికారి మనోరమ అన్నారు. మండలంలోని ఏ ఆర్ పురంలో గురువారం జిల్లా మలేరియా అధికారి విలేజ్ హెల్త్ క్లినిక్ మరియు ఇంటింటి లార్వా, ఫీవర్ సర్వేలో పాల్గొన్నారు. సిహెచ్ఓ శిరీషను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దోమ ద్వారా చికెన్ గున్యా, మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు వస్తాయన్నారు. దోమలను లార్వాదశలోనే అంతం చేయాలన్నారు. దోమ పుట్టకూడదు, కుట్టకూడదన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించి ,ఇంటిలో ఉన్న నిల్వ నీటిని తొలగించి, పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలన్నారు. వేసవికాలంలో ఎండలు తీవ్రంగా ఉండటం వలన ఉదయం 10 కే పనులను ముగించుకుని, తిరిగి సాయంత్రం 5 గంటలకు బయటకు పోవాలన్నారు. ఓ ఆర్ ఎస్ ,మజ్జిగ, టెంకాయ నీళ్లు తీసుకొని వేసవిలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడిఏమాలజిస్ట్ ఖాజా మేధాన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ, వైద్య సిబ్బంది వీరి జనార్ధన్ రావు, శ్రీరామయ్య వెంకటసుబ్బయ్య , సి హెచ్ ఓ శిరీష ,ఆశ ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# వెక్కిరిస్తున్న సమావేశాలు

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 9** : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి మూడు నెలలకు ఓసారి జరిగే సమావేశాలు వెక్కిరింపుగా మారుతున్నాయి. సమావేశానికి పూర్తి నివేదికలతో హాజరుకావాలని సంబంధిత అధికారులకు తాఖీదులు పంపుతున్నారు. వచ్చిన అధికారులంతా, తమ శాఖ పరిధిలో అది చేశాం, ఇది చేసాం అని చెప్పడంతోనే సరిపుచ్చుతున్నారు. గత సమావేశాలలో జరిగిన సమస్యల పరిష్కార విషయంలో మరో దఫా జరిగే సమావేశాలలో ఏమాత్రం చర్చించడం లేదు. సమావేశాలకు గైరాజరవుతున్న అధికారులపై చర్యలు లేవు. రానివారికి సమావేశాలకు ఎందుకు రాలేదని సంజయిషీ నోటీసులతోనే సరిపుచ్చుతున్నారు. సమావేశానికి వచ్చి నా అధికారులంతా ఏదో వచ్చాం! పోయాం! సర్పంచుల పదవీకాలం ఈనెల రెండవ తేదీ నాటికి ముగియడంతో వారి స్థానంలో ప్రభుత్వం మండల స్థాయిలో పనిచేస్తున్న అధికారులను ఆఫీసర్లుగా నియమించింది. వీరి హయంలోనైనా గ్రామాల అభివృద్ధి విషయంలో అధికారులు చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**డయాస్ కూడా వెక్కిరింపే** మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేసే డయాస్ కూడా వెక్కిరింపుగా మారింది. సాధారణంగా గ్రామ పంచాయతీలలో మునిసిపాలిటీలో సమావేశాలు జరుగుతున్నప్పుడు సర్పంచ్ గాని మండల అధ్యక్షుడు కానీ, మేయర్ కానీ అధ్యక్ష స్థానంలో ఉండి సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంటుంది. వీరు లేనిపక్షంలో మండల ఉపాధ్యక్షుడు కానీ, గ్రామ ఉప సర్పంచ్ గాని సమావేశాన్ని అధ్యక్ష స్థానంలో ఉండి సభను నిర్వహించాల్సి ఉంటుంది. కానీ బండి ఆత్మకూరు మండల సర్వ సభ్య సమావేశంలో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతూ ఉంది. మండల అధ్యక్షుడు తో పాటు, ఉపాధ్యక్షుడు కూడా వేదికపై కూర్చొని సమావేశాలు నిర్వహించడం చర్చకు దారితీస్తూ ఉంది. సభా సాంప్రదాయలకు తిలోదకాలిచ్చి మండల పరిషత్ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై తోటి సభ్యులు క్రింది స్థాయి సిబ్బంది ముక్కున వేలు వేసుకుంటున్నారు. శుక్రవారం నాడు జరిగే మండల సర్వ సభ్య సమావేశంలోనైనా అధికారులు సభ సంప్రదాయాలను పాటించి మసలుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## నంద్యాల జిల్లా హజ్ యాత్రికుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఫిరోజ్



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 9 ( నంది పత్రిక )**నంద్యాల పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో జిల్లా హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా హజ్ యాత్రికుల శిక్షణ తరగతుల కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి చీవీణ ఫిరోజ్ ముఖ్య అతిథిగా పాల్గొనడంతో నిర్వాహకులు వారికీ ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా చీఎం ఫిరోజ్ గారు మాట్లాడుతూ, ముస్లింలకు అత్యంత పవిత్రమైన హజ్ యాత్రకు అవకాశం లభించడం గొప్ప అదృష్టమని పేర్కొన్నారు.హజ్ యాత్ర ఆధ్యాత్మిక శుద్ధి, నియమ నిష్ఠలు, సహనం మరియు సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. యాత్రికులు క్రమశిక్షణతో, ఆరోగ్య పరిరక్షణతో, మార్గదర్శకాలను పాటిస్తూ హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసి ప్రపంచ శాంతికి ప్రత్యేక ప్రార్థనలు చెయ్యాలని సూచించారు.హజ్ యాత్రికులకు సమగ్ర మార్గదర్శకత్వం అందిస్తూ శిక్షణ ఇస్తున్న ఇస్లామిక్ పండితులు, హజ్ కమిటీ అధికారులు,నిర్వాహకుల కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. హజ్ యాత్రికులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హజ్ యాత్రను సంపూర్ణంగా పూర్తి చేసేందుకు వారు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు.అనంతరం హజ్ యాత్రికుల కోసం రాష్ట్ర మంత్రివర్యులు చీఎం ఫరూక్ గారు ఏర్పాటు చేసిన భోజన సదుపాయాన్ని వారికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా హజ్ కమిటీ సభ్యులు డా ఇంతియాజ్ అహ్మద్, హాఫిజ్ అంజాద్ బాషా, హాఫిజ్ అబ్దుల్ హాది, రఫీ మౌలానా, మాబాషా మౌలాన, చాబోలు ఇలియాస్ మైనార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో హజ్ యాత్రికులు పాల్గొన్నారు.

## జనాభాగణన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి : తహసిల్దార్ ఐ విజయశ్రీ.



**శిరివెళ్ల (నంది పత్రిక) :-** సిరివెళ్ల మండల పరిధిలోని ఆయా గ్రామాలకు కేటాయిస్తున్నటువంటి ఎనిమిరేటర్లు సూపర్వైజర్లు సంబంధిత జన గణన సిబ్బంది జనాభా గణన 0ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తహసిల్దార్ ఐ విజయశ్రీ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఏపీ మోడల్ స్కూల్ సమావేశ భవనంలో నిర్వహించినటువంటి శిక్షణ కార్యక్రమానికి సూపర్వైజర్లు ఎన్యుమరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఐ విజయశ్రీ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 16వ జనాభా గణన ప్రక్రియ పై సంబంధిత యాప్ మరియు నైపుణ్యత వివరాల పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి బ్యాచ్ కి నిర్వహించే మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలలో జనాభగణన డేటా సేకరణపై అధికారులు పూర్తి అవగాహన నైపుణ్యత పెంపొందించుకోవాలని తహసిల్దార్ పిలుపునిచ్చారు. జనగణన ప్రక్రియలో భాగంగా డేటా సేకరణలో ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం అప్పగించిన జన గణన ప్రక్రియను బాధ్యతయుతంగా నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. బోయలకుంట్ల, చెన్నూరు, గంగవరం, మహదేవపురం, వనికందిన్నె జీనపల్లె తదితర గ్రామాలకు సంబంధించిన సూపర్వైజర్లు ఎనిమరేటర్లకు ట్రైనర్స్ లకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు.

జనగణన ప్రక్రియను పారదర్శకంగా, లోప రహితంగా పూర్తి చేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. జనగణన ద్వారా సేకరించే గణాంకాలు అభివద్ధి ప్రణాళికల రూపకల్పనకు పునాది వంటివన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరవేయడానికి ఖచ్చితమైన గణాంకాలు ఎంతగానో దోహదపడుతుందన్నారు. మొదటి దశలో ఇళ్ల జాబితా సేకరణ, రెండో దశలో జనాభా వివరాల సేకరణ ఉంటాయన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ తనకు కేటాయించిన లాగిన్ వివరాలతో యాప్‌ను సక్రమంగా నిర్వహించడం, డేటా ఎంట్రీ, సర్వర్‌కు లింక్ చేయడం నైపుణ్యత పెంపొందించుకోవాలని తహసిల్దార్ ఐ విజయశ్రీ సూచించారు వయస్సు, విద్యార్హత, వృత్తి, సామాజిక వర్గం, మౌలిక వసతుల వివరాలు వంటి అంశాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఖచ్చితమైన సమాచారం మాత్రమే నమోదు చేయాలని గృహ నిర్మాణం, నీటి వనరు, మరుగుదొడ్డి, విద్యుత్, వంట ఇంధనం, ఇంటర్నెట్ సౌకర్యం వంటి 33 అంశాలపై సమగ్ర సమాచారం సేకరనకు పూర్తి అవగాహనతో అడుగు వేయాలన్నారు.

## ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి: సబ్ రిజిస్ట్రార్ జగదీష్



**నంది పత్రిక –ప్యాపిలి** ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సబ్ రిజిస్ట్రార్ జగదీష్ అన్నారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రజలకు ఈ చట్టం యొక్క విశిష్టతను వివరించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకోవడానికి ఇ× ఒక శక్తివంతమైన ఆయుధమని జగదీష్ పేర్కొన్నారు. ప్రజలు చైతన్యవంతులైతేనే అవినీతిని అరికట్టడం సాధ్యమవుతుందని, సమాచార హక్కు చట్టం ద్వారా ప్రతి పైసా ఖర్చును ప్రశ్నించే అధికారం సామాన్యుడికి ఉందని ఆయన తెలిపారు. సామాన్య ప్రజలు చాలా సులభంగా నిర్ణీత రుసుము చెల్లించి సమాచారాన్ని ఎలా పొందాలో ఆయన సోదాహరణంగా వివరించారు. 30 రోజుల్లోపు సమాచారం ఇవ్వని పక్షంలో ఉన్నతాధికారులకు అప్పీలు చేసుకునే విధానాన్ని కూడా తెలియజేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియలు, నిబంధనలు పత్రాల విషయంలో ఎటువంటి సందేహాలున్నా ఈ చట్టం ద్వారా నివృత్తి చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పలువురు సామాజిక కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రాయలసీమ అభివృద్ధికి అమరావతి శాపం: అబ్దుల్లా బేగ్ గ్రేటర్ రాయలసీమ కోసం ఉద్యమం తప్పదని హెచ్చరిక



**వెలుగోడు, ఏప్రిల్ 09 (నంది పత్రిక):** రాయలసీమ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర రాజధాని అమరావతి శాపంగా మారిందని మాజీ ఎస్‌డిపిఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్లా బేగ్ గురువారం వెలుగోడులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఉమ్మడి రాష్ట్ర విభజన వల్ల కలిగిన నష్టాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, అలాంటి పరిస్థితుల్లో అమరావతిని రాజధానిగా ప్రకటించడం ద్వారా రాయలసీమకు మరోసారి అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రజల సంపదను విస్తృతంగా వినియోగించుకున్నారని, పరిశ్రమలు, ఐటీ హబ్‌లు, అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రో రైళ్లు, భారీ మౌలిక వసతుల నిర్మాణం వంటి అంశాలన్నీ అక్కడే కేంద్రీకృతమయ్యాయని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు మళ్లీ ఒకే ప్రాంతమైన అమరావతిపై భారీగా నిధులు వెచ్చించడం సమంజసం కాదని అన్నారు. దీని రాయవల్లసీమలో మౌలిక వసతులు, పరిశ్రమల అభివృద్ధి మందగించే ప్రమాదం ఉందని, ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతాయని పేర్కొన్నారు. ఫలితంగా రాయలసీమ యువత ఉపాధి కోసం వలసలు వెళ్లే పరిస్థితులు ఏర్పడతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర నిధుల వినియోగంలో అసమానతలు పెరిగే అవకాశం ఉందని, నీటి వనరుల సమస్యలు కూడా తీవ్రరూపం దాల్చాలని అబ్దుల్లా బేగ్ అన్నారు. రాయలసీమ ప్రజాప్రతినిధులు ప్రాంత అభివృద్ధిపై కృషి చేయకుండా సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదమని. రాజధాని అమరావతి అయినా సరే, రాయలసీమకు సముచిత న్యాయం జరగేలా రాష్ట్ర నిధుల్లో సమాన వాటా తీసుకురావాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. లేదంటే రాయలసీమ యువత గ్రేటర్ రాయలసీమ కోసం ఉద్యమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.

# ఏబీఎన్ రాధాకృష్ణను తక్షణమే అరెస్ట్ చేయాలి

### వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్



**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన ఏబీఎన్ రాధాకృష్ణపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కోడుమూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన డాక్టర్ సతీష్, రాధాకృష్ణ వ్యాఖ్యలు సమాజంలో మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి బూతు రాతలు, వ్యాఖ్యలను ఏ మాత్రం సహించబోమని స్పష్టం చేశారు. చట్టం అందరికీ సమానమైతే, వెంటనే చర్యలు తీసుకుని ఆయనను అరెస్ట్ చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. అంతేకాక, గతంలో సాక్షి కార్యాలయంపై దాడి జరిగినప్పుడు పోలీసులు సరైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అప్పట్లో దాడులు జరిగి కార్యాలయాన్ని తగలబెట్టినా, పోలీసులు అడ్డుకోలేదని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు అదే విధంగా తప్పు చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నేతల కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసినా, కూటమి నాయకులు వాటిని సమర్థించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. మహిళల గౌరవాన్ని కించపరిచే ఘటనలు జరుగుతున్నప్పటికీ, బాధితులకు మద్దతుగా ఎవరూ స్పందించకపోవడం ఆందోళనకరమని డాక్టర్ సతీష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత, గౌరవం కాపాడాలంటే ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని ఆయన హెచ్చరించారు. రాధాకృష్ణపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుని, అరెస్ట్ చేయాలని, లేనిపక్షంలో పార్టీ తరఫున ఆందోళనలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, కోడుమూరు మండల రైతు విభాగం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, బూత్ కమిటీ జిల్లా సభ్యులు రమేష్, నాగభూషణ్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాధాకృష్ణ వ్యాఖ్యలపై బద్వేలు నేతల ఫైర్: పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

### మహిళల పట్ల అనుచిత రాతలపై ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ ఆగ్రహం



**బద్వేలు, ఏప్రిల్ 9 (నంది పత్రిక ):**వైయస్సార్ జిల్లావైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల కుటుంబ సభ్యులను, ముఖ్యంగా మహిళలను కించపరుస్తూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అధినేత రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వికృత వ్యాఖ్యలను బద్వేలు నియోజకవర్గ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ తీవ్రంగా ఖండించారు. పార్టీ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి వారు ఈ అంశంపై నిరసన వ్యక్తం చేశారు.

**వ్యక్తిగత దూషణలు జుగుప్సాకరం**ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజకీయ విభేదాలను పక్కన పెట్టి నేతల వ్యక్తిగత జీవితాలను, వారి భార్యలను లక్ష్యంగా చేసుకుని రాధాకృష్ణ రాసిన రాతలు పరాకాష్టకు చేరాయని మండిపడ్డారు. ఇవి కేవలం రాజకీయ విమర్శలు కావని, మహిళా లోకాన్ని అవమానించడమేనని ధ్వజమెత్తారు. జుగుప్సాకరమైన తన వ్యాఖ్యలను రాధాకృష్ణ వెంటనే వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**జర్నలిస్ట్ అని పిలవడమే అవమానం** ఇలాంటి వికృత ధోరణి కలిగిన వ్యక్తిని 'జర్నలిస్ట్' అని పిలవద్దని పాత్రికేయ లోకానికి వారు విజ్ఞప్తి చేశారు. విలువలతో కూడిన జర్నలిజానికి రాధాకృష్ణ మచ్చ తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ ఆయన క్షమాపణ చెప్పకపోతే, వైయస్ఆర్ సీపీ నాయకులు మరియు మహిళా విభాగం ఆధ్వర్యంలో తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

**పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**మహిళల గౌరవాన్ని కాపాడటంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని నేతలు కోరారు. అనంతరం, ఏబీఎన్ రాధాకృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎడిటర్ రాధా కృష్ణనుఅరెస్టు చేయాలి



**కొత్తపల్లి – నంది పత్రిక:** వైఎస్సార్సీపీ నాయకులు, వారి భార్యల పట్ల అసభ్య పదజాలంతో దూషించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎడిటర్ అయిన రాధాకృష్ణను వెంటనే అరెస్టు చేయాలని జెడ్పిటీసీ సోమల సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషాలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్ నందు ఎస్ఐ జయశేఖర్ కు రాధాకృష్ణపై కేసునమోదు చేయాలని వైఎస్సార్సీపీ నాయకులతో కలసి పిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వారు మాట్లాడుతూ రాధా కృష్ణ టీడీపీ అండ ఉందనే మధంతో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలను వెన్నెముక లేని బ్యాచ్ గా అభివర్ణించడం అలాగే భార్యలైన మహిళలను అవమానకరంగా మాట్లాడడం సిగ్గులేటు అన్నారు. ఇలాంటి వ్యక్తిని వెంటనే జర్నలిజం నుంచి బహిస్కరించాలని, అతన్ని వెంటనే అరెస్టు చేసి మరళ ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ మహమ్మద్ గౌస్, వైఎస్సార్సీపీ ఇంటలెక్చువల్ ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, పబ్లిసిట్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు రహంతుల్లా, గోకవరం మాజీ సర్పంచు మారెన్న, గుమ్మడాపురం మాజీ ఉప సర్పంచు బి. శ్రీనివాసులు యాదవ్, మాజీ ఎంపీటీసీలు స్రవంతి, బాలరాజు, శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, రమేష్ బాబు, రామిరెడ్డి, నాగార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ మోహన్ రెడ్డిని కలిసిన చాపాటి సాయి నారాయణ రెడ్డి



**బద్వేలు,ఏప్రిల్ 9 (నంది పత్రిక ):**వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో కడప జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు చాపాటి సాయి నారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బద్వేలు నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై వారు చర్చించారు. ముఖ్యంగా బద్వేలులో కూటమి నాయకులు వైయస్ఆర్ సీపీ కార్యకర్తలు, నాయకులపై సాగిస్తున్న కక్షసాధింపు చర్యలను సాయి నారాయణ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను జగన్ మోహన్ రెడ్డికి వివరించి, పార్టీ శ్రేణులకు అండగా ఉండాలని కోరారు

## కొత్తపల్లె సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ

### తనిఖీ చేసిన నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**బేతంచెర్ల ఏప్రిల్ 9 ( నందిపత్రిక).** బేతంచెర్ల మండలం ఆర్.కొత్తపల్లె గ్రామంలోని, గ్రామ సచివాలయాన్ని గురువారం నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సచివాలయంలో అందిస్తున్న సేవలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సదుపాయాలు,రికార్డుల నిర్వహణ,ఆన్లైన్ హాజరు వివరాలు వంటి అంశాలను సమగ్రంగా జిల్లా కలెక్టర్ పరిశీలించడం జరిగింది.



## తీవ్ర ఉద్రిక్తతల నడుమ హర్మూజ్ దాటి భారత్ చేరుకున్న 'గ్రీన్ ఆశా'

పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నడుమ, భారత ఇంధన సరఫరా వ్యవస్థలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. 'గ్రీన్ ఆశా' అనే భారతీయ జెండా కలిగిన ఎల్‌పీజీ నౌక, 15,400 టన్నుల లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ)తో గురువారం నవీ ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ (జేఎన్‌పీఏ)కు సురక్షితంగా చేరుకుంది. భౌగోళికంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని విజయవంతంగా దాటిన ఈ నౌక, జేఎన్‌పీఏలోని భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), ఇండియన్ ఆయిల్ (ఐఓసీఎల్) నిర్వహిస్తున్న లిక్విడ్ బెర్త్‌లో లంగరు వేసింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం ప్రారంభమైన తర్వాత జేఎన్‌పీఏకు చేరుకున్న మొట్టమొదటి ఎల్‌పీజీ నౌక ఇదే కావడంతో దీనిని ఒక ముఖ్యమైన మైలురాయిగా అధికారులు అభివర్ణించారు. నౌకలోని సిబ్బంది, కార్గో అంతా సురక్షితంగా ఉన్నట్లు జేఎన్‌పీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

## సమస్యల పరిష్కారానికె సర్వసభ్య సమావేశం :

### ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం



**శిరివెళ్ల (నంది పత్రిక) :-** సిరివెళ్ల మండల పరిధిలోని ఆయా గ్రామాలలో నెలకొని ఉన్నటువంటి సమస్యల పరిష్కారానికి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నాయక్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీవో సి శివ మల్లేశ్వరప్ప ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాబోయే రెండు నెలల్లో తరచూ అకాల వర్షాలు పెనుగాలులు ఉంటాయని వాటికి అనుగుణంగా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రానున్న ఖరీఫ్ లో ఆపరాల సాగుకు వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తున్నదని విత్తనాలు అందజేస్తుందని వ్యవసాయ అధికారి సుధాకర్ తెలియజేశారు. ఐసిడిఎస్ సిడిపిఓ తేజశ్వరి మాట్లాడుతూ శ్రీ శిశు సంక్షేమ అభివృద్ధి సంక్షేమ పథకాలు వారికి అందిస్తున్న పౌష్టిక ఆహార వసతులు వివరించారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వర రెడ్డి మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా సమగ్రంగా ఎదుర్కొనేందుకు గ్రామపంచాయతీ కార్యదర్శులకు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు., ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు తమతమ నివేదికను చదివి వినిపించారు. వీరారెడ్డి పల్లి నుండి కోటపాడు వరకు గల రహదారిని మరియు శిరివెళ్ల నుండి చిన్న కంబలూరు మెట్ట వరకు గుంతల మయంగా ఉన్నటువంటి రహదారిని అభివృద్ధి చేయాలని ఆర్ అండ్ బి ఏఈ ని ఎంపీపీ వసీం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు ఎంపీటీసీలు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్య తలెత్తితే గంటల్లోనే పరిష్కారం.

**సమస్య దృష్టికి వచ్చిన మరోక్షణమే అధికారులకు ఎమ్మెల్యే కోట్లఫోన్ కాల్.**

**గొరుమానుకొండ తాగునీటి తలెత్తక ముందే పరిష్కారం పట్ల ప్రజల హర్షం వ్యక్తం.**



**బేతంచెర్ల ఏప్రిల్ 9 ( నందిపత్రిక ).** డోన్ నియోజకవర్గంలో వేసవి ప్రారంభం కాకముందు నుండే త్రాగు నీటి సరఫరా పై, ప్రత్యేక దృష్టి పెట్టిన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి సమస్య తన దృష్టికి వచ్చిన మరు క్షణమే అధికారులకు ఫోన్ కాల్ చేయడంతో గంటల్లో నీటి సమస్యను పరిష్కరించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బేతంచెర్ల మండలం గొరుమానుకొండ వద్ద ఈనెల 8వ తేదీ బుధవారం రాత్రి 9 గంటలకు బోరు చెడిపోవడంతో, త్రాగునీటి సమస్య ఏర్పడుతుందని ఎమ్మెల్యే దృష్టికి వెళ్ళింది. మరో క్షణమే ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించడంతో,రంగ ప్రవేశం చేసిన అధికారులు గంటల్లోనే కొత్త మోటర్ ను ఏర్పాటు చేసి, నీటి సరఫరాకు ఎలాంటి అవరోధం కలగకుండా చర్యలు చేపట్టారు. వెంటనే మోటర్ ను బిగించి యధావిధిగా త్రాగునీటి సరఫరాను కొనసాగించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే స్పందన పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## బోడె రామచంద్ర యాదవ్ ఆమరణ నిరాహార దీక్షలకు సంఘీభావంగా కర్నూలులో రిలే దీక్షలు చేస్తున్న బీసీవై పార్టీ రాష్ట్ర ఈసి సభ్యులు కంది వరుణ్ కుమార్ యాదవ్




**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** రాష్ట్రంలో బిసిల అణచివేతకు వ్యతిరేకంగా బిసి వై పార్టీ వ్యవస్థాపకులు బోడె రామచంద్ర యాద వ్ ఐదు డిమాండ్ ల సాధన కోసం ఈ నెల 11వ తేదీన ఆమరణ నిరాహార దీక్షలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కర్నూలు ధర్నా చౌక్ లో బీసీవై పార్టీ రాష్ట్ర ఈసి సభ్యులు కంది వరుణ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో రిలే నిరా హార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా కంది వరుణ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ 70 ఏళ్ళ స్వతంత్ర దేశంలో నేటికీ బిసి సామాజిక వర్గం అణచివేతకు గురవుతున్నట్లు చెప్పారు. రెండు సామాజిక వర్గాల ఆధిపత్యం బిసిలను ఓటు బ్యాంక్ యంత్రాలుగా చూస్తున్నారని ఆవేదన చెందారు. ప్రభుత్వాలు మారుతున్న విద్యా, వైద్యం, ఉద్యో గం, ఉపాధి రంగాలలో బిసిలకు న్యాయం జరగ లేదన్నారు. ప్రస్తుతం బిసి సామాజిక వర్గం అభివృద్ధి సాధన కోసం బోడె రామచంద్ర యాదవ్ బిసివై పార్టీ స్థాపించి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన విజయవాడలో 1 బిసి రక్షణ చట్టం అమలు, 2 రాజధాని ప్రాంతంలో బిసిలకు 1000 ఎకరాలు భూమి కేటా యింపు, 3 బిసి కులాల కార్పోరేషన్లకు నిధులు 4 సమగ్ర కుల గణన, 5 విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థలు, చట్ట సభల్లో 44 శాతం రిజర్వేషన్ వంటి తదితర డిమాండ్ ల కోసం ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టడం హర్షనీయం అన్నారు. ఈ దీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు తరలివచ్చి జయప్రదం చేయాలని వారు పిలిపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అర్జున్ వాల్మీకి, బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, బిసి సంఘం నాయకులు సింధు నాగేశ్వరావు, అయ్యన్న యాదవ్, మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహానందిలోని రెండో చిన్న కోనేరులో మరమ్మతు పనులు



**మహానంది ఏప్రిల్ 09 (నంది పత్రిక):-** మహానందిలోని రెండో చిన్న కోనేరులో మరమ్మతు పనులను ఆలయ అధికారులు ప్రారంభించారు. సుమారు రూ. 25 లక్షల వ్యయంతో మెట్లు బాగు చేయడం, నూతన బండల ఏర్పాటు పనులు చేపట్టారు. ఇప్పటికే బయట ఉన్న ఒక కోనేరును ఆధునికీకరించిన విషయం తెలిసిందే. ఆలయ సహజత్వాన్ని దెబ్బతీయకుండా పనులు పూర్తి చేయాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పౌర సేవల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం

### జిల్లా కలెక్టర్ మరియు కడప నగరపాలక ప్రత్యేక అధికారి డా. శ్రీధర్ చెరుకూరి



**వై ఎస్ ఆర్ కడప,బ్యూరో చీఫ్ ఏప్రిల్ 9నంది పత్రిక :** కడప నగరపాలక పరిధిలో పౌర సేవలను పారదర్శకంగా అమలు చేయడం, సమస్యలను వేగవంతంగా పరిష్కరించడం కోసం వారంలో ఒకరోజు (శుక్రవారం)ఓపెన్ ఫోరం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మరియు కడప నగర పాలక ప్రత్యేక అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.. ఈ మేరకు గురువారం కడప నగర పాలక ప్రత్యేక అధికారి వారు కడప మున్సిపల్ కమిషనర్, కడప ఆర్డీవోకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలను అందించడం, పౌర సేవలు పొందడంలో ఇబ్బందులను, సమస్యలను వేగంగా పరిష్కరించడం కోసం వారంలో ఒకరోజు (శుక్రవారం) ఓపెన్ ఫోరం నిర్వహించాలన్నారు. ఓపెన్ ఫోరం లో భాగంగా భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అనుమతులు, ఆమోదం, బిపిఎస్, ఎల్ఆర్ఎస్ సంబంధించి పెండింగ్ దరఖాస్తులను వేగంగాపరిష్కరించాలన్నారు. కడప నగరపాలక కమిషనర్ ఆధ్వర్యంలో కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి పెండింగ్ దరఖాస్తులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఓపెన్ ఫోరం కార్యక్రమంలో సంబంధిత అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, పెండింగ్ దరఖాస్తులు అన్నింటి పైన పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. ఇదే సమయంలో దరఖాస్తు దారులు, పౌరులు, డెవలపర్లు,లైసెన్స్ పొందిన సర్వేయర్లు,ఇతర భాగస్వాములను ఓపెన్ ఫోరం లో భాగస్వాములు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి శుక్రవారం కడప మున్సిపల్ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించామని ఆ ప్రకటన లో తెలిపారు.

## స్కానింగ్‌కు బయటికి పంపిసే చర్యలు తప్పవు డిసిఎస్ హెచ్ఓ.



**బేతంచెర్ల ఏప్రిల్ 9 ( నందిపత్రిక).** బేతంచెర్ల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని డిసి ఎస్ హెచ్ఓ డాక్టర్ లలిత గురువారం పరిశీలించారు. ఆసుపత్రిలోని గర్భిణిలతో ఆమె మాట్లాడారు. వారి చేతిలో ఉన్న బయట స్కానింగ్ చేయించిన రిపోర్టులను పరిశీలించారు. ప్రభుత్వం గర్భిణులకు అందిస్తున్న సేవలను వివరించారు. మరోసారి స్కానింగ్‌ల కోసం గర్భిణిలను బయటికి పంపిస్తే, తగు చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సిబ్బందిని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గర్భిణీలకు కూర్చోవడానికి సరైన కనీసం వసతులు లేకపోవడంతో డీసీఎస్ హెచ్ ఓ డాక్టర్ లలిత అసహనం వ్యక్తం చేశారు. వైద్యానికి వచ్చేవారు ఓపి కోసం లోపలికి వెళ్లి, ఓపి తీసుకోవడానికి ఎలా వీలవుతుందని ఆసుపత్రి సూపరిండెంట్ సాగరికను ప్రశ్నించారు. తక్షణమే ఓపి ను ప్రజలకు అందుబాటులో బయటికి మార్చాలని డాక్టర్ లలిత ఆదేశించారు. వైద్యులు ఆసుపత్రిలో అందుబాటులో ఉండడం లేదని ఆసుపత్రికి వచ్చిన ప్రజలు డిసిఎస్ హెచ్ఓ డాక్టర్ లలితకు తెలిపారు. వైద్యులు తమ విధులను ఆస్పత్రిలో ఉండి సక్రమంగా నిర్వహిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, అలా కాదని సొంత ప్రైవేట్ లో కనిపిస్తే,అట్టి వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని, డీసీఎస్ హెచ్ఓ డాక్టర్ లలిత హెచ్చరించారు. మెరుగైన సేవల కోసం వైద్యులకు ఆదేశించడంతో గర్భిణీ స్త్రీలు, అక్కడి ప్రజలు డీసీఎస్ హెచ్ ఓ కి ధన్యవాదాలు తెలిపారు.

# హజ్ యాత్ర-2026 కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**విజయవాడలో హజ్ హౌస్ నిర్మాణానికి చర్యలు**

**హజ్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన మంత్రి**

**ఏపీ నుంచి హజ్ కు 2000 మంది ప్రయాణికులు**

**అమరావతి. ఏప్రిల్ 09 . (నంది పత్రిక ):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుండి హజ్ - 2026 కి మొత్తం 2000 మంది యాత్రికులు బయలుదేరనున్నారని, అందులో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి ఏప్రిల్ 18 మరియు 19 తేదీలలో 352 మంది ప్రయాణికులు బయలుదేరనున్నారని, వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికార యంత్రంగాన్ని రాష్ట్ర న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఫరూక్ ఆదేశించారు. గురువారం గన్నవరం ఎస్ఎం కన్వెన్షన్ హాల్ లో హజ్ క్యాంప్ -2026 కు ఏర్పాట్లపై మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ అధ్యక్షతన సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో టిడిపి ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగర నడిబొడ్డున అన్ని సౌకర్యాలతో హజ్ భవన్ నిర్మించడం జరిగిందన్నారు. అప్పట్లో హైదరాబాదులో కూడా ఎంబార్కేషన్ కేంద్రం ఉండేది కాదని, అప్పటి ప్రధాని వాజ్ పేయి దృష్టికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకువెళ్లడంతో ఏంబార్కేషన్ కేంద్రం మంజూరు అయిందని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ ప్రయాణికులకు ఏంబార్కేషన్ కేంద్రం అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాలలోని కేంద్రాలకు వెళ్లాల్సి వస్తున్నదన్నారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా కేంద్రం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి విజయవాడకు ఏంబార్కేషన్ కేంద్రం మంజూరు చేయించారని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గారికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకి, కేంద్ర మైనారిటీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు గారికి , పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు గారికి మంత్రి ఫరూక్ ధన్యవాదాలు తెలిపారు. పవిత్ర మక్కాయాత్ర హజ్ కు వెళ్లే యాత్రికులందరికీ, అన్ని రకాల మౌలిక సదుపాయాలతో విజయవాడలో హజ్ హౌస్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. విజయవాడ నుంచి హజ్ కి వెళ్లే ప్రయాణికులు అందరికీ రూ. లక్ష ఆర్థిక సాయం కూటమి ప్రభుత్వం అందిస్తున్నదని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముస్లిం మైనారిటీల తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. లి




పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశం రాష్ట్రం నలుమూలల నుండి విజయవాడకు చేరుకునే ప్రయాణికులందరికి ఏర్పాటు చేసే క్యాంప్ లో హజ్ యాత్ర విజయవంతం కోసం అనుసరించాల్సిన నియమ నిబంధనలు, పద్ధతులు, వ్యవహరించాల్సిన తీరును విశదీకరించాలని సూచించారు. విజయవాడ నుండి మదీనాకు ప్రత్యేక విమానాల ఏర్పాటు, యాత్రికుల బోర్డింగ్ వివరాలను హజ్ కమిటీ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. యాత్రికుల లగేజీని వేగంగా తరలించేలా చూడాల్సిన ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. విమానాశ్రయంలోహజ్ యాత్రికుల కోసం ప్రత్యేక కౌంటర్లు, విడిగా అరైవల్/ డిపార్చర్ లాంజ్-లను, నమాజు వసతిని కేటాయించాలని, చెక్-ఇన్ ప్రక్రియ కోసం అదనపు సిబ్బందిని నియమించాలని, ప్రయాణికుల రాకపోకల విషయంలో హజ్ కమిటీతో సమన్వయం చేసుకోవాలన్నారు. హజ్ వీసాలను త్వరితగతిన క్లియర్ చేసేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రూపుల కోసం ముందస్తు క్లియరెన్స్ సౌకర్యం కల్పించాలని పాస్ పోర్ట్ వెరిఫికేషన్ కోసం 24/7 సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. యాత్రికుల కోసం భద్రతా ప్రోటోకాల్ ను పెంచాలని, మహిళా యాత్రికుల కోసం ప్రత్యేక మహిళా సిబ్బందితో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. క్యాంప్ లు,లాంజ్-ల వద్ద సిసిటివి నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితి ని సంబంధిత అధికార యంత్రాంగం తెలుసుకుంటూ అందుకు అనుగుణంగా చర్యలు అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. కరెన్సీ మార్పిడి, హజ్ చెల్లింపుల కోసం క్యాంప్ తో పాటు విమానాశ్రయం వద్ద తగినన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. యాత్రికులకు ఎటువంటి అదనపు రుసుము లేకుండా మార్పిడి సౌకర్యం, డిజిటల్ బ్యాంకింగ్ మద్దతు అందించాలని ఆదేశించారు. **ప్రత్యేకంగా బస్సులు నడపాలి** హజ్ యాత్రకు వెళ్ళేందుకు విజయవాడకు చేరుకునే యాత్రికులు అందరూ క్యాంప్ నుండి విమానాశ్రయం కు ఇబ్బందులు లేకుండా చేరుకునేలా ప్రత్యేక ఏసీ బస్సులను నడపాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు. క్యాంప్, విమానాశ్రయం వద్ద తగినంత మంది వైద్యులు, నర్సులను అందుబాటులో ఉంచి, ప్రయాణానికి ముందు తప్పనిసరి ఆరోగ్య పరీక్షలు, ఉచిత వ్యాక్సినేషన్లు అందించాలన్నారు. అంబులెన్స్ లను సిద్ధంగా ఉంచాలన్నారు.

**భద్రత ఏర్పాట్లను పగడ్బందీగా చేయాలి** హజ్ యాత్ర క్యాంప్ వద్ద తగినంత భద్రతా సిబ్బందితో ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని పోలీస్ శాఖకు మంత్రి ఫరూక్ సూచించారు. నేషనల్ హైవే-16 పై ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని, యాత్రికులకు రక్షణ కల్పించడంతో పాటు, మోసాలకు పాల్పడే సైబర్ నేరగాళ్లపై నిఘా ఉంచాలన్నారు. క్యాంప్ వద్ద అంతరాయం లేని విద్యుత్ సరఫరా, బ్యాకప్ జనరేటర్లను సిద్ధం చేయాలన్నారు. లాంజ్-లలో 24/7 లైటింగ్ మరియు ఏసీ సౌకర్యం ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రతిరోజు సరిపడా ఆర్.ఓ తాగునీటిని సరఫరా చేయాలని,క్యాంప్ వద్ద తగినన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేసి, రోజువారీ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. లిఅగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలని క్యాంప్, వద్ద, విమానాశ్రయం వద్ద ఫైర్ ఇంజన్ల వాహనాలను అందుబాటులో ఉంచాలాన్నారు. మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, అత్యవసర పరిస్థితుల్లో ఖాళీ చేసే విధానాలపై వాలంటీర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. యాత్రికుల మార్గాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో హజ్ అప్డేట్స్ కోసం రోజువారీ మీడియా బులెటిన్లను విడుదల చేయాలని,సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, తదితర సమాచార మార్గాల ద్వారా చేసి, ఎప్పటికప్పుడు సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో హజ్ యాత్ర విజయవంతం కోసం భాగస్వాములై యాత్రికులు అందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు. ఈ సమీక్షలో హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూఖ్ షుబ్లీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ , హజ్ కమిటీ సభ్యులు, హజ్ కమిటీ సీఈఓ గౌస్ పీర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యారసాల సమీపంలో ఘనంగా శ్రీ ప్రసన్న బండ్లమాంబ, రాజమాత దేవి బ్రహ్మోత్సవాలు



**పోరుమామిళ్ల, ఏప్రిల్ 9(నంది పత్రిక):** పోరుమామిళ్ల మండలం యారసాల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి, శ్రీ ప్రసన్న బండ్లమాంబ రాజమాత దేవి బ్రహ్మోత్సవాలు ఈనెల 5 నుండి 7వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. 15వ తేదీ వరకు దర్శన అవకాశం ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ, శ్రీ రాజమాత దేవి ఈనెల 15వ తేదీ వరకు ఆలయ ఆవరణలోనే ఉంటారని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అమ్మవారిని దర్శించి ఆశీస్సులు పొందాలని కోరారు.

**భక్తుల నమ్మకం.. సేవా కార్యక్రమాలు** గతంలో 2018 ఫిబ్రవరి 19న ఆలయానికి భూమి పూజ చేసి నిర్మాణం చేపట్టామని నాగార్జున రెడ్డి వివరించారు. పోతిరెడ్డి కృష్ణమ్మ అమ్మవారికి ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. ప్రతి ఏటా ఇక్కడ జరిగే ఉత్సవాలకు భక్తులు భారీగా తరలివస్తారని, సంతాన ప్రాప్తి కోసం, ఉద్యోగ అవకాశాల కోసం మరియు తమ సమస్యలు తొలగిపోవాలని భక్తులు అమ్మవారిని వేడుకుంటారని పేర్కొన్నారు.

**విస్తరిస్తున్న ఆశ్రమాలు** ప్రకాశం జిల్లాకు చెందిన సధర్మ సాధన నిలయం అనుబంధ సంస్థగా ఈ ఆలయం వెలసింది. బెంగళూరు నగరంతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అమ్మవారి గుడి, ఆశ్రమాలు నిర్మించినట్లు ఆయన తెలిపారు. భక్తుల మనోభీష్టాలను నెరవేరుస్తూ ఇక్కడ నిరంతరం పూజా కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు



## హర్మూజ్ జలసంధి నుంచి వెనక్కి మరలుతున్న నౌకలు

ఇరాన్, అమెరికా దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో మొదట ఇరాన్ హర్మూజ్ జలసంధిని తెరిచింది. కానీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి నేపథ్యంలో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారియి. హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీనితో జలసంధిని దాటేందుకు వచ్చిన నౌకలు తిరుగుముఖం పట్టాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి.

# జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరంబ్యూరో చీఫ్ ఏప్రిల్ 9,నంది పత్రిక** రబీ సీజన్ ప్రారంభాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రెవెన్యూ, పౌరసరఫరాలు, రవాణా, కోఆపరేటివ్ శాఖల అధికారులతో దాన్ని కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై గురువారం గూగుల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్ మరియు మే నెలలు రబీ సీజన్‌కు అత్యంత కీలకమని, ఈ కాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి కేంద్రంలో కనీసం 50 శాతం గోనె సంచులు సిద్ధంగా ఉంచి వాటి నాణ్యతను పరిశీలించాలని, సిబ్బంది అందుబాటులో ఉండేలా ఎం.ఎల్.ఓలు బాధ్యత వహించాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని, మిల్లర్లు గోనె సంచుల సరఫరాకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రబీ సీజన్‌లో జిల్లాకు 7.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం రవాణా కోసం 1000 వాహనాలను సిద్ధం చేయగా, ఇప్పటివరకు 438 వాహనాలకే రిజిస్ట్రేషన్ పూర్తయిందని, మిగిలిన వాహనాల రిజిస్ట్రేషన్‌ను వెంటనే పూర్తి చేయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అనంతరం గ్యాస్ సరఫరా వ్యవస్థపై పౌరసరఫరాలు మరియు రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఎక్కడా గ్యాస్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, వినియోగదారులు బుకింగ్ చేసిన తేదీ ఆధారంగా సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. డొమెస్టిక్ గ్యాస్‌ను అక్రమంగా ఇతర అవసరాలకు వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీలు వచ్చిన మరియు పంపిణీ చేసిన సిలిండర్ల వివరాలను నిర్దిష్ట రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ప్రతి ఏజెన్సీలో ఫిర్యాదు రిజిస్టర్ అందుబాటులో ఉండాలని తెలిపారు. సరఫరా సమయంలో ఓటీపీ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రెవిన్యూ, ఎండిఓ లు, ఏవోలు, పౌరసరఫరాలు, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# డిజిటల్ పద్ధతిలో జనగణన సర్వే

## ఆర్డీఓ వెంకట శివ



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 9:** 2027 కు సంబంధించి జనగణన సర్వేను పగడ్బందీగా నిర్వహించాలని ఆత్మకూరు ఆర్డీవో వెంకట శివ అన్నారు. గురువారం బండి ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లకు సూపర్వైజర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆర్డిఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు మౌలిక వసతులు అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి జనాభా గణాంకాలు కీలకమని పేర్కొన్నారు. మొదటిసారిగా జనాభా గణాంకాలు డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. జనగణన సర్వే రెండు దశలలో జరుగుతుందని మొదటి దశలో గృహ వివరాలు ఆస్తుల వివరాలు గృహాల పరిస్థితిని సేకరిస్తామని పేర్కొన్నారు మే నెల నుండి జూన్ వరకు మొదటి దేశ జనగణన సర్వే పేర్కొన్నారు 2027 ఫిబ్రవరి నుండి 2వ దశ మొదలవుతుందని జనాభా వివరాలు ఆర్థిక స్థితిగతులు విద్య వ్యక్తిగత వలసల సమాచారాన్ని సేకరిస్తామని తెలిపారు. జనగణన సేకరణలో ప్రజలతో సన్నిహితంగా మర్యాదగా వ్యవహరించి డేటాను సేకరించాలని సూచించారు. ప్రతి ఎనన్యుమరేటరు తనకు కేటాయించిన లాగిన్ వివరాలతో వ్యాపును సక్రమంగా నిర్వహించాలని డేటా ఎంట్రీ సర్వర్కు లింకు చేయడం నేర్చుకోవాలని అన్నారు. వివరాలను సేకరించే సమయంలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పద్మావతమ్మ ఎంఈఓ యశోద మండల సర్వేయర్ నాగప్రసాద్ ఏఎస్ఓ అరుణ జూనియర్ అసిస్టెంట్ శ్యామ్ మహిళా సంరక్షకులు విలేజ్ సర్వేయర్లు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు

# అక్రిడిటేటెడ్ జర్నలిస్టులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు ఏప్రిల్ 10, 13 తేదీలలో..

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరంబ్యూరో చీఫ్ : ఏప్రిల్ 9,నంది పత్రిక** జిల్లాలోని అక్రిడిటేటెడ్ జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ఉచిత మెడికల్ హెల్త్ చెకప్ కార్యక్రమం నిర్వహణకు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ కార్యక్రమం భీమవరం, వీరవాసరం, ఉండి, కాళ్ళ, ఆకివీడు, పాలకోడేరు జర్నలిస్టులకు ఏప్రిల్ 10వ తేదీ ఉదయం భీమవరం జిల్లా కలెక్టర్ ప్రాంగణంలో భీమవరం లైన్స్ క్లబ్, ఫెమినా లైన్స్ క్లబ్, ఒమిక్స్ నెక్స్ట్ జెన్ లాబరేటరీస్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జర్నలిస్టుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మీడియా ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అలాగే మిగతా నియోజకవర్గాల్లో ఈ ఆరోగ్య శిబిరాలు ఏప్రిల్ 13న నిర్వహించడం జరుగుతుందని, నరసాపురం ఏరియా హాస్పిటల్ నందు నరసాపురం, మొగల్తూరు జర్నలిస్టులకు,



పాలకొల్లు ఏరియా హాస్పిటల్ నందు ఆచంట, పాలకొల్లు, యలమంచిలి జర్నలిస్టులకు, తాడేపల్లిగూడెం ఏరియా హాస్పిటల్ నందు తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం జర్నలిస్టులకు, తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు తణుకు, ఇరగవరం, అత్తిలి, పెనుగొండ, పోడూరు మండలాల జర్నలిస్టులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిబిరంలో భాగంగా జర్నలిస్టులకు రక్తపోటు (బీపీ ) పరీక్ష, రక్తంలో చక్కెర స్థాయి (షుగర్) పరీక్ష, ఈసీజీ (ఈసీజీ ), 2ఐ ఎకో (గుండె సంబంధిత పరీక్షలు), కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ ) ముఖ్యమైన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించబడతాయి. ఈ శిబిరంలో పలు విభాగాల నిపుణులు వైద్యులు పాల్గొని సేవలు అందిస్తారు. దీనిలో ముఖ్యంగా కార్డియాలజీ నిపుణులు, జనరల్ మెడిసిన్ వైద్యులు, నేత్ర వైద్యులు ఆర్థోపెడిక్ నిపుణులు న్యూరో, గ్యాస్ట్రో తదితర విభాగాల వైద్యులు అవసరమైన వారికి ప్రత్యేక నిపుణుల ద్వారా మరింత లోతైన పరీక్షలు మరియు సలహాలు అందిస్తారు. వైద్య పరీక్షలకు హాజరయ్యే అక్రిడిటేటెడ్ జర్నలిస్టులు పేరు, పనిచేస్తున్న పత్రిక/చానల్ వివరాలు, అక్రిడిటేషన్ నంబర్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు శిబిరం రోజున కౌంటర్లలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని మీడియా ప్రతినిధులు ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు.

# భూ సంబంధిత సమస్యలు లేకుండా పారదర్శకంగా వేగంగా పనులు పూర్తి చేయాలి :

## జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.



**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 9నంది పత్రిక** భీమవరం మండలం అనాకోడేరు గ్రామ సచివాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న రీ–సర్వే పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. సిబ్బందికి రీ–సర్వే పనులు సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన దిశానిర్దేశాలు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో భూ సంబంధిత పనులను ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా మరియు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 9–(2) నోటీసులను ఈ వారం చివరి నాటికి సంబంధిత రైతులకు పూర్తిగా అందజేయాలని, నోటీసులపై ఏవైనా అభ్యంతరాలు వచ్చిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న డి.ఎల్.ఆర్ (డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్)లను ఈ నెల 15వ తేదీ లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. రైతులు తమ భూముల విస్తీర్ణంలో ఏవైనా తేడాలు గమనించినట్లయితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి సరిచేసుకోవాలని సూచించారు. భూ రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం మరియు పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, మండల సర్వేయర్ ఎన్.ప్రవీణ్ కుమార్, గ్రామ సర్వేయర్లు రాజేష్, హారిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం మంచి అలవాట్లు అత్యంత అవసరం

## జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 9నంది పత్రిక** జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఎనిమిదవ పోషణ పక్వాడ 2026 కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను గురువారం కలెక్టరేట్ చాంబర్లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఏప్రిల్ 9 నుండి 23 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించబడుతుందన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం చిన్ననాటి నుంచే మంచి అలవాట్లు అలవర్చడం అత్యంత ముఖ్యమని తెలిపారు. పోషణ పక్వాడ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం మరియు పోషణపై సమగ్ర అవగాహన కల్పించడం అని చెప్పారు. పిల్లల శారీరక ఆరోగ్యానికి మాత్రమే కాకుండా మానసిక, సామాజిక వికాసానికి కూడా మంచి ఆచారాలు, అలవాట్లు అవసరమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా చిన్నారులు తాతయ్యలు, అమ్మమ్మలు, నాన్నమ్మలతో సమయం గడపడం ద్వారా కుటుంబ విలువలు, సాంప్రదాయాలు సహజంగా నేర్చుకుంటారని పేర్కొన్నారు. పెద్దలతో కథలు వినడం, అనుభవాలను పంచుకోవడం పిల్లల మానసిక వికాసానికి దోహదం చేస్తుందని తెలిపారు.



తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపడం, వారితో కలిసి ఆటలు ఆడించడం ద్వారా మొబైల్ ఫోన్లు, టెలివిజన్ వినియోగాన్ని తగ్గించవచ్చని సూచించారు. చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారం, వ్యక్తిగత శుభ్రత, క్రమబద్ధమైన జీవన విధానంపై పిల్లలకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. మన సంప్రదాయ ఆహారపు అలవాట్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ప్యాక్డ్ మరియు జంక్ ఫుడ్ వినియోగం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని హెచ్చరించారు. అందువల్ల వీలైనంత వరకు ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని పిల్లలకు అందించాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామ స్థాయిలో ఇంటింటికీ వెళ్లి పోషణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహార ప్రదర్శనలు, అవగాహన ర్యాలీలు, ఆరోగ్య శిబిరాలు, తల్లుల కోసం ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషణ సేవలు ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు. పోషకాహార లోపంతో ఎవరూ బాధపడకుండా, అందరికీ సమతుల ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి.శ్రీలక్ష్మి, జిల్లా వైద్య శాఖ అధికారి జి.గీతాబాయి, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ పి.చంద్రశేఖర్, డీసీపీఓ రాజేష్, జిల్లా శిశు సంక్షేమ శాఖ నోడల్ అధికారి పి.విజయలక్ష్మి, వన్ స్టాప్ సెంటర్ ప్రతినిధి ధనలక్ష్మి, సిడిపివోలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు..

# జలదుర్గం పరిధిలో నేడు విద్యుత్ నిలిపివేత

**నందిపత్రిక –ప్యాపిలి** 33/11 కేవీ జలదుర్గం బుగ్గ ఫీడర్ పరిధిలో అత్యవసర నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం 10–04–2026 విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ వినయ్ కుమార్ పత్రికా ప్రకటనలో తెలిపారు.ఉదయం 08:30 గంటల నుంచి మధ్యాహ్నం 01:30 గంటల వరకు సుమారు 5 గంటలు విద్యుత్ నిలిపివేయబడుతుందన్నారు.రైతులకు ఇచ్చే త్రీ–ఫేస్ కరెంట్ సరఫరాలో మార్పులు చేయడం జరిగింది. రేపు సాగునీటి కరెంట్ తెల్లవారుజామున 05:00 నుంచి ఉదయం 09:00 వరకు 4 గంటలు వరకు మధ్యాహ్నం 01:30 నుంచి సాయంత్రం 06:30 వరకు 5 గంటల వరకు,విద్యుత్ లైన్ల నిర్వహణ పనులకు వినియోగదారులు, రైతులు సహకరించలన్నారు. పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడుతుందన్నారు.

# పోషణ అభియాన్ 8వ విడత పోషణ పక్వాడా గోడపత్రిక ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

**ఏలూరు,బ్యూరో చీఫ్ ఏప్రిల్, 9 నంది పత్రిక :** పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యానికి మొదటి ఆరు సంవత్సరాలలో అందించే పోషకాహారమే ప్రధానమని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. పోషణ అభియాన్ లో భాగంగా 8వ విడత పోషణ పక్వాడ పోస్టర్ ను కలెక్టర్ గురువారం కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పోషకాహార ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్న పిల్లల్లో పోషకాహార లోపాన్ని పోగొట్టేందుకు పూర్తిస్థాయిలో పోషకాహారాన్ని అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోషకాహార ప్రాధాన్యతపై ఈ సంవత్సరం పోషణ పక్వాడను ఏప్రిల్ 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కార్యక్రమం ప్రధానంగా "మొదటి 6 సంవత్సరాల జీవన కాలంలో సమగ్ర అభివృద్ధి" అనే అంశంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి అవగాహన కలిగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లి మరియు శిశు పోషణ, 0–3 సంవత్సరాల పిల్లల మానసిక అభివృద్ధి, 3–6 సంవత్సరాల పిల్లల ప్రాథమిక విద్య



, స్క్రీన్ టైమ్ తగ్గించడం తల్లిదండ్రుల పాత్ర, అంగన్వాడి కేంద్రాల బలోపేతానికి సమాజ భాగస్వామ్యం అనే అంశాలపై అవగాహన కలిగిస్తున్నామని, ప్రధాన థీమ్స్ మరియు కార్యకలాపాలలో మొదటి 1000 రోజులు లో "సుపోషిత జనని స్వస్థ శిశు" కార్యక్రమం, "సూపర్ డ్యాడ్" రెసిపీ పోటీలు, తల్లి తండ్రుల భాగస్వామ్యంపై అవగాహన వర్క్‌షాపులుథీమ్ 2: పోషిత భారత్ జంక్ ఫుడ్ ఫ్రీ కమ్యూనిటీ , "నుక్కడ్ నాటక్" ద్వారా అవగాహన కార్యక్రమాలు, "స్వాప్ ది స్నాక్" ప్రదర్శనలు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లపై ప్రచారం , థీమ్ 3: ప్రాథమిక విద్య మరియు వృద్ధి (3–6 సంవత్సరాలు), "ఖేల్ సే సీక్" కార్నివాల్"టాయ్–అ–థాన్" కార్యక్రమం, తండ్రులతో కథా విన్యాసం కార్యక్రమాలు, థీమ్ 1: గోల్డెన్ విండో అదనంగా, సోషల్ మీడియా ద్వారా అవగాహన సందేశాలు, డ్రాయింగ్ పోటీలు, కమ్యూనిటీ ఈవెంట్లు నిర్వహించబడతాయన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి ప్రతి కుటుంబానికి పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే ప్రజలు ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఐ.సి.డి.యస్. ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. శారద, నోడల్ అధికారి మరియు డి.యం.సి. ఇ. తులసి, సిడిపిఓ. ఎ. పద్మావతి, ఇ.ఓ., జె.వి. రమణ, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కె.కామేశ్వరరావు, జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్ కె. శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# బేతంచెర్ల మండలంలో జళ దార – జళ హారతి కార్యక్రమం.

## నిర్వహించిన బేతంచెర్ల మండల తహసీల్దార్ నాగ మణి.

**బేతంచెర్ల ఏప్రిల్ 9 ( నందిపత్రిక ).** బేతంచెర్ల మండల తహసీల్దార్ నాగమణి గురువారం మండలంలోని గ్రామాలలోని ప్రాంతాలను పరిశీలించడం జరిగింది.మండలంలోని,పెండేకల్ గ్రామం – మర్రికుంట & మర్రిచెరువు,ముద్ద వరం –దాసి చెరువు గూటుపల్లి గ్రామం తవిసకొండ & ఊర కుంట (ఎంఐ ట్యాంక్) లను "జలధార జలహారతి 100 రోజుల కార్యక్రమం"లో భాగంగా పనుల గుర్తింపును చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, బేతంచెర్ల, ఏఈ మైనర్ ఇరిగేషన్ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఆనంవారిపల్లెలో రేషన్ బియ్యం భారీ పట్టివేత: 51 బస్తాలు స్వాధీనం

## అక్రమ నిల్వదారులపై విజిలెన్స్ దాడులు.. నిందితుడిపై కేసు నమోదు

**కాశినాయన ఏప్రిల్ 9 (నంది పత్రిక ):** కడప జిల్లా కాశినాయన మండలం ఆనంవారిపల్లెలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివశంకర్ మరియు సిబ్బంది ఆనంవారిపల్లెలో ఆకస్మిక దాడులు నిర్వహించి 51 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అక్రమ నిల్వలకు పాల్పడిన చంద్రశేఖర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసిన అధికారులు, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సమీపంలోని రేషన్ దుకాణానికి తరలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వివిధ గ్రామాల్లో ఎవరైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా లేదా అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఇటువంటి అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు



# మహిళలను కించపరిచిన ఏబీఎన్ ఛానల్ ఎండి రాధాకృష్ణపై పోలీసులకు ఫిర్యాదు





### రాధాకృష్ణ మహిళలకు క్షమాపణ చెప్పాలి
### లేదంటే మహిళలతో పెద్ద ఎత్తున ఉద్యమం
### చేపడతాం మాజీ ఎమ్మెల్యే కాటసాని

**బనగానపల్లె ఏప్రిల్ 9 నంది పత్రిక** ఏబీఎన్ రాధాకృష్ణ తన పత్రిక ఛానల్లో డిబేట్ ప్రోగ్రాం ద్వారా మహిళలను కించపరుస్తూ అసభ్య పదజాలంతో రాసిన రాతలపై మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని లేదంటే మహిళలతో పెద్ద ఎత్తున నిరసన ఉద్యమాలు చేపడతామని బనగానపల్లె వైసిపి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రము మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైయస్సార్సీపి మండల స్థాయి నాయకులు అభిమానులు కార్యకర్తలతో కలిసి తన స్వగృహం నుండి కాలినడకన పోలీస్ స్టేషన్ చేరుకొని ఏబీఎన్ రాధాకృష్ణపై చేసిన ఫిర్యాదు పత్రాన్ని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ కు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒకప్పుడు కిరోసిన్ను అమ్ముకోవడం, పేపర్ బాయ్ గా పని చేసిన రాధాకృష్ణ నేడు ఒక చానల్ ఒక పత్రికకు అధిపతి ఎలా అయ్యాడని ప్రశ్నించారు. నువ్వు ఎంతమందికి ఊడిగం చేసి వాటికి యజమానివయ్యావని ప్రశ్నించారు. ఈనాటికి ఆ ఊడిగం చేసే పని నువ్వు మానలేదని మా పార్టీ అధికారంలోకి రాగానే నువ్వు రాసిన రాతలపై ఖచ్చితంగా నీకు తగిన విధంగా బుద్ధి చెబుతామని అన్నారు.మా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల భారీ నుండి తప్పించేందుకు రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించి సులువైన మార్గంగా రాజధాని మావిగన్ను సూచించారని దాన్ని సమర్ధించిన మహిళల పట్ల ఏబీఎన్ రాధాకృష్ణ తన చానల్లో పత్రికలో అసభ్యమైన పదజాలంతో వారిని కించపరుస్తూ రాశారని ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. దీనిపై రాధాకృష్ణ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని లేదంటే మహిళలతోనే పెద్ద ఎత్తున ఉద్యమాలు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్రెడ్డి, ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, బనగానపల్లె మండల అధ్యక్షులు సన్నల జనార్దన్ రెడ్డి ముస్లిం మైనారిటీ నాయకులు అబ్దుల్ ఫైజ్, మైనారిటీ లీగల్ సెల్ అధ్యక్షులు అబ్దుల్ ఖైర్, ఎస్టీ సెల్ కార్యదర్శి శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకానికి సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహణ




**వెలుగోడు, ఏప్రిల్ 09 (నంది పత్రిక):** వెలుగోడు మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కు సంబంధించిన 19వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం బుధవారం జరిగింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యనారాయణ ప్రిసైడింగ్ అధికారిగా, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు, ఖర్చుల వివరాలను గుర్తించి. మండలంలో మొత్తం 1145 పనులు చేపట్టగా, వేతన వ్యయం రూ. 5,93,02,471, మెటీరియల్ ఖర్చు రూ. 46,28,364గా ఉండి, మొత్తం రూ. 6,39,30,835 ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.పంచాయతీరాజ్ విభాగం ద్వారా 70 పనులు నిర్వహించడం, వేతనాలు రూ. 7,425, మెటీరియల్ ఖర్చు రూ. 1,72,93,456తో కలిపి మొత్తం రూ. 1,73,00,881గా నమోదైంది. ఆర్డబ్ల్యూఎస్ పరిశీలన ఒక పని చేపట్టి, వేతనం రూ. 407, మెటీరియల్ రూ. 8,36,809తో మొత్తం రూ. 8,37,216 ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఐటిడిఏ పరిధిలో 2 పనులకు రూ. 12,05,743 మెటీరియల్ ఖర్చు నమోదైంది. గ్రామాల వారీగా రికవరీ/పెనాల్టీ వివరాలు కూడా ఉన్నాయి. అబ్దుల్లాపురంలో రూ. 1,000, పంచాయతీరాజ్ శాఖ రూ. 1,22,180, బోయరేవులలో రూ. 2,428, గుంటకండలలో రూ. 3,316, మోత్కూరులో రూ. 6,836, వెలుగోడులో రూ. 3,249, రెగడగూడూరులో రూ. 1,296, వేల్పనూరులో రూ. 213గా నమోదయ్యాయి. మాదవరం గ్రామంలో ఎటువంటి రికవరీ లేకపోవడం. మొత్తం మీద ఉపాధి హామీ పథకంలో రూ. 18,228, పంచాయతీరాజ్ శాఖ రూ. 1,22,180 రికవరీ/పెనాల్టీగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు.సామాజిక తనిఖీ ద్వారా పథక అమలులో పారదర్శకత పెరుగుతుందని, లోపాలను గుర్తించి సరిదిద్దేందుకు ఇది కీలకమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిడి వెంకట రామిరెడ్డి, అంబుడ్స్ పర్సన్ మద్దిలేటి, ఏవీవోలు పరమేశ్వరుడు, రాజశేఖర్, ఎస్ఆర్పీ లక్ష్మీనారాయణ, డీఆర్పీలు, ఉపాధి హామీ సిబ్బంది, వెటర్నరీ డాక్టర్ కిషోర్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, హౌసింగ్ విభాగంలోని ఇంజనీర్లు, సిబ్బంది ఉన్నారు. ఉపాధి హామీ శ్రామికులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బేతంచెర్లలో ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరణ.

### -డోన్ ఎంఎల్ ఏ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి.



**బేతంచెర్ల ఏప్రిల్ 9 ( నంది పత్రిక ).** గౌరవనీయులు మాజీ కేంద్ర మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు ,డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో 10 వ తేది శుక్రవారం ఉదయం 10 గంటలకు, బేతంచెర్ల పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో, ప్రజల నుండి ఫిర్యాదుల (గ్రీవెన్స్ ) స్వీకరణ కార్యక్రమం నిర్వహించుచున్నారు, కావున బేతంచెర్ల పట్టణ మరియు మండల ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా ఆధార్ కార్డు జోడించి, గౌరవ ఎమ్మెల్యేకి విన్నవించ గలరు, ఈ కార్యక్రమానికి బేతంచెర్ల ప్రజలు ,కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయ వలసిందిగా బేతంచెర్ల తెలుగు దేశం పార్టీ కార్యాలయం వారు గురువారం నాడు తెలియ జేశారు.

## భూగర్భ జలాలు పెంపునకు చర్యలు :
## తాసిల్దార్ జ్యోతి రత్నకుమారి

**ఆళ్లగడ్డ ప్రతినిధిఏప్రిల్ 9నంది పత్రిక** మండలంలోని ఆర్ కృష్ణాపురం బాచుపల్లి గ్రామాల్లో భూగర్భ జలాలు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తాసిల్దారు జ్యోతి రత్నకుమారి తెలిపారు. బుధవారం ఆళ్లగడ్డ మండలంలోని బాచేపల్లి గ్రామంలో ఎర్రకుంట పాములేటి కుంట పోతురాజు చెరువును ఆమె పరిశీలించారు . కాలువల్లో చెరువులో పూడికతీత పనుల గురించి ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. జలాలను నిల్వ ఉంచేలా చేయాల్సిన పనులపై అధికారులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ కృష్ణాపురం బాచేపల్లి గ్రామాల్లో భూగర్భ జలాలు తక్కువగా ఉండడంతో భూగర్భ జలాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మార్వో తెలిపారు. అనంతరం బాచేపల్లి కృష్ణాపురం సచివాలయాలను తనిఖీ చేశారు. టిడిపి మండల కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి ఉపాధి హామీ సిబ్బంది ఇరిగేషన్ అధికారులు వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## దళితుడి ఇంటికి నిప్పు
## పోలీస్ స్టేషన్లో తలారి నరసింహుడు.



**శిరివెళ్ల (నంది పత్రిక)** గ్రామంలో తలారి ఉద్యోగం పేరుతో జీతం తీసుకుంటూ బాధ్యతగా వ్యవహరించాల్సిన వ్యక్తి ఎస్సీ కాలనీలోని ఒక ఇంటికి నిప్పు పెట్టిన సంఘటన గురువారం ఉదయం సంచలనంగా మారింది.మండల పరిధిలోని బోయలకుంట్ల గ్రామంలో గల ఎస్సీ మాదిగ పేటలో బడితల సుధాకర్ అనే వ్యక్తికి చెందిన గుడిసెకు గ్రామానికి చెందిన తలారి నరసింహుడు నిప్పు పెట్టారని కాలనీవాసులు పేర్కొన్నారు. అర్ధరాత్రి సుమారు రెండు గంటల నుండి మాదిగ పేటలో ఉద్రిక్తత భయాందోళన వాతావరణం నెలకొన్నది. సుధాకర్ కు చెందిన గుడిసెలో వృద్ధురాలు అయిన తన తల్లి నివాసం ఉంటున్నట్లు నిప్పు పెట్టిన సమయంలో అమే లేదని తన తల్లి ఊరికి వెళ్ళినట్టు తెలియజేశారు. గుడిసెలోని సామాన్లు దుస్తులు ఇతర వస్తువులు కాళీ బూడిద అయ్యాయని తెలియజేశారు బోయలకుంట్ల గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొనడంతో శిరివెళ్ల పోలీసులు గ్రామానికి చేరుకొని అనుమానితుడైన తలారి నరసింహన్నీ పోలీస్ స్టేషన్ కు తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు.

# కాస్కేడ్ విధానంతో ట్యాంకుల నింపుదలపై కలెక్టర్ ఫోకస్

### డోన్ నియోజకవర్గంలో నీటి సామర్థ్య పెంపుకు కార్యాచరణ
### చిట్టచివరి ఆయకట్టు వరకు నీరు అందించడమే లక్ష్యం
### జలధార ప్రోగ్రామ్‌తో నీటి వనరుల బలోపేతం
### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, ఏప్రిల్09(నంది పత్రిక):–** జిల్లాలో కాస్కేడ్ విధానం ద్వారా ట్యాంకులను సమర్థవంతంగా నింపేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో 'జలధార' కార్యక్రమంపై భూగర్భ జలశాఖ, జలవనరుల శాఖ, డ్వామా మరియు ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్( ఏపీ ఎస్ ఆర్ ఏ సి) నోడల్ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి 'జలధార' కార్యక్రమానికి సాంకేతిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు. జిల్లాలో గుర్తించిన 23 కాస్కేడ్ వ్యవస్థల ద్వారా 86 ట్యాంకులను నింపేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా డోన్ నియోజకవర్గంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి, చిట్టచివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ క్రమంలో జిల్లాకు సంబంధించిన అడ్మినిస్ట్రేటివ్ సరిహద్దులు, వాగులు, ట్యాంకులు, భూభాగ వినియోగ వివరాలతో కూడిన జియోస్పేషియల్ మరియు జీఐ ఎస్ మ్యాప్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. అలాగే జిల్లాలోని 23 కాస్కేడ్ ట్యాంకులను టోపోషీట్ల ఆధారంగా ఒకే మ్యాప్‌లో సమగ్రంగా పేర్కొన్నారు. జిల్లాలోని 11 మండలాల్లో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లోని త్రాగునీటి సమస్యల పరిష్కారం, బనగానపల్లి పశ్చిమ ప్రాంతంలో కొత్త కాస్కేడ్ ప్రతిపాదన, కొలిమిగుండ్ల, సంబంధిత ప్రాంతాల్లోని నీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అమలు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా భూగర్భ జలశాఖ అధికారి రఘురాం, జలవనరుల శాఖ అధికారి శివశంకర్, డ్వామా పీడీ సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించాలి.

### కమిషనర్ ఎన్.మౌర్య.



**తిరుపతి బ్యూరో చీఫ్ ఏప్రిల్ 9నంది పత్రిక** అన్నా క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించాలని, ఎటువంటి లోపాలు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం నగరంలోని స్విమ్స్ కూడలి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాయంత్రం భోజనం చేస్తున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చేవారికి నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు. అన్నం వృధా చేయకుండా తగినంత తీసుకోవాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే తీసుకోవాలని సూచించారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. ప్రజల నుండి ఎటువంటి పిర్యాదులు అందకుండా జాగ్రత్తగా శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు.



## డాక్టర్ బాబా షాహెబ్ అంబేద్కర్ అన్ని సామజిక వర్గాలకు న్యాయం చేశారు...

### బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు

**బనగానపల్లె ఏప్రిల్ 9నందిపత్రిక** డాక్టర్ బాబాషాహెబ్ అంబేద్కర్ అన్ని సామజికవర్గాలకు న్యాయం చేసారని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్ బాబు అన్నారు. గురువారం రాయలసీమ ఎస్సి మోర్చా సమావేశం తిరుపతిలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పనతల సురేష్ బాబు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ పివిఎన్ రాష్ట్ర అధ్యక్షులు పిలుపుమేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సూచన మేరకు ఈనెల 11వ తారీఖు నుండి 24 వ తారీకు వరకు జయంతి ఉత్సవాలు ప్రతి జిల్లాలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు జరపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ! మన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం కల్పించబడే మహోన్నతమైన వ్యక్తి అని ఆయన చాలా శుభ సందర్భంగా అని అభివర్ణించారు. ఇవాళ రాజ్యాంగంలో లిఖించబడినటువంటి విధంగా మన దేశ ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ గారు అమలు చేస్తున్నారని ఆయన అన్నారు, ఇవాళ ప్రతి ఒక్కరికి భారతదేశంలో స్వేచ్ఛ భావం హక్కును కలిపించినటువంటి మహనీయుడు మన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి సాధ్యమని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు ప్రతి ఒక్కరు ఇవాళ అంబేద్కర్ ఆశయాలను సాధించాల్సిన అవసరం ఉందని తొందరలో చెక్కభజనలు కోలాటం మరియు కబడ్డీ, వాలీబాల్ రాష్ట్ర యాప్తంగా అంబేద్కర్ జయంతి సందర్భంగా కడప మరియు తిరుపతి లో జరగబోతున్నాయి అని రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్ గారు తెలియజేశారు. ఈకార్యక్రమం లో నంద్యాల జిల్లా అధ్యక్షులు తప్పేట. ప్రసాద్,,,జిల్లా ప్రధాన కార్యదర్శి యూట్యూబ్. గణేష్,, మరియు బీజ్జం. వెంకట చలపతి జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు జిల్లా ఉపాధ్యక్షులు కొండపల్లి. క్రిష్టప్ప రాయలసీమ జిల్లా అధ్యక్షులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు



## మంత్రివర్యులు టీ.జీ. భరత్ గుప్తా సారధ్యంలో ఉచిత మెగా వైద్య శిభిరం

**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖా మంత్రివర్యులు టీ.జీ. భరత్ గుప్తా సారధ్యంలో గౌరి గోపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశంపార్టీ కార్యకర్త లకు గురువారం ఉచిత మెగా వైద్యశిభిరం కర్నూలు నగరంలోని గౌరి గోపాల్ హాస్పిటల్ నందు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ శిభిరానికి తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్ ముఖ్యులుగా హాజరై ప్రారంభించడం జరిగింది. తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు తమ యొక్క తెలుగుదేశంపార్టీ సభ్యత్వం కార్డు తీసుకొని వచ్చి ఈ శిభిరం నందు ఉచితంగా ఆర్.బి.ఎస్, ఈ.సి.జి, 2 డి ఎకో, టీ.ఎం.టి, ఫైబ్రో స్కాన్ మరియు కంటి పరీక్షలను చేయించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి వెంకటేశ్వర్లు నాగరాజ్ యాదవులు మాట్లాడుతూ కర్నూలు ప్రజల కోసం నిత్యం ఎన్నో కార్యక్రమాలు చేపడుతూ మంత్రి టీజీ భరత్ గుప్త కర్నూల్ ప్రజల కోసం ఉచిత వైద్యం మెగా శిబిరం ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఇవే కాక ఎన్నో కార్యక్రమాలు చేపడతారని కర్నూలు ప్రజల కోసం ఎంత దూరమైనా ఎన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి అయినా వినకడుగు వేయరని అది ఒక టీజీ ఫ్యామిలీకి మాత్రమే చెందుతుందని కాబట్టి ఇటువంటి కార్యక్రమాలని కర్నూలు నగర ప్రజలే కాక కర్నూల్ నియోజకవర్గం లో ఉండే ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొరకంచి రవికుమార్ సోమిశెట్టి శ్రీకాంత్ రాజశేఖర్ రెడ్డి సోమిశెట్టి నవీన్ కైప పద్మాల అత్తారెడ్డి అక్షయ కుమారి రాజ్యలక్ష్మి రామాంజనేయులు గట్టు తిలక్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# పౌర సేవల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం

### జిల్లా కలెక్టర్ మరియు కడప నగరపాలక ప్రత్యేక అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

**వై ఎస్ ఆర్ కడపబ్యూరో చీఫ్ ,ఏప్రిల్ 9నంది పత్రిక** : కడప నగరపాలక పరిధిలో పౌర సేవలను పారదర్శకంగా అమలు చేయడం, సమస్యలను వేగవంతంగా పరిష్కరించడం కోసం వారంలో ఒకరోజు (శుక్రవారం)ఓపెన్ ఫోరం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మరియు కడప నగర పాలక ప్రత్యేక అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.. ఈ మేరకు గురువారం కడప నగర పాలక ప్రత్యేక అధికారి వారు కడప మున్సిపల్ కమిషనర్, కడప ఆర్డీవోకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలను అందించడం, పౌర సేవలు పొందడంలో ఇబ్బందులను, సమస్యలను వేగంగా పరిష్కరించడం కోసం వారంలో ఒకరోజు (శుక్రవారం) ఓపెన్ ఫోరం నిర్వహించాలన్నారు. ఓపెన్ ఫోరం లో భాగంగా భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అనుమతులు, ఆమోదం, బిపిఎస్, ఎల్ఆర్ఎస్ సంబంధించి పెండింగ్ దరఖాస్తులను వేగంగాపరిష్కరించాలన్నారు. కడప నగరపాలక కమిషనర్ ఆధ్వర్యంలో కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి పెండింగ్ దరఖాస్తులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఓపెన్ ఫోరం కార్యక్రమంలో సంబంధిత అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, పెండింగ్ దరఖాస్తులు అన్నింటి పైన పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు.ఇదే సమయంలో దరఖాస్తు దారులు, పౌరులు, డెవలపర్లు,లైసెన్స్ పొందిన సర్వేయర్లు,ఇతర భాగస్వాములను ఓపెన్ ఫారం లో భాగస్వాములు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి శుక్రవారం కడప మున్సిపల్ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని



ఆదేశించామని ఆ ప్రకటన లో తెలిపారు.

# బేతంచెర్ల పట్టణ ఆస్తి పన్ను చెల్లింపు దారులకు గడువు పొడిగింపు.

### - నగర పంచాయితీ కమీషనర్ డి. హరిప్రసాద్.



**బేతంచెర్ల ఏప్రిల్ 9 ( నందిపత్రిక )**. రాష్ట్రం లోని ఆస్తి పన్ను చెల్లింపు దారులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.2025 -2026 ఆర్థిక సంవత్సరం నకు సంభందించి పెండింగ్ లో ఉన్న ఆస్తి పన్నులపై 50% వడ్డీ మాఫీ గడువు పొడిగించడం జరిగింది. పౌరులు తమ పాత బకాయిలను తక్కువ ఆర్థిక భారంతో, క్లియర్ చేసుకునేందుకు ఇదొక్క చక్కటి అవకాశం.దీనితోపాటు రాబోయే ఆర్థిక సంవత్సరం (2026- 27) పన్నును, ముందుగానే చెల్లించే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తుంది.2026 ఏప్రిల్ 30 వతేదీ లోపు పన్ను మొత్తాన్ని చెల్లించిన వారు 5% ముందస్తు రాయితీ పొందవచ్చు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని వడ్డీ మాఫీ మరియు పన్ను రాయితీ వంటి ప్రయోజనాలను పొంద వచ్చునని బేతంచెర్ల నగర పంచాయితీ కమీషనర్ డి.హరిప్రసాద్ గురువారం ప్రకటన ద్వారా తెలియజేశారు.

# మత్స్యకారుల సంక్షేమ సమితి



**శ్రీశైలం ఏప్రిల్ 09(నంది పత్రిక)** మత్స్యకార సంక్షేమ సమితి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకార గ్రామాల్లో గత 20 సంవత్సరాల నుండి సప్త సూత్రాలు ఆధారంగా పనిచేస్తుంది. అవి విద్య, వైద్యము, భక్తి (భజన), మహిళా మండలి, క్రీడలు, స్వయం ఉపాధి, పర్యావరణ పరిరక్షణ ఈ సూత్రాలు ఆధారంగా పనిచేస్తుంది. ప్రతి సంవత్సరం రాష్ట్రంలో ఏదోకచోట ఒక్కో విభాగం తరపున సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ సంవత్సరంలో 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భక్తి విభాగం తరపున శ్రీశైలంలో అనుకోవడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నలుమూలల నుండి 27 జిల్లాల నుండి సుమారు 2000 మంది మత్స్యకార భక్తులు ఆధ్యాత్మిక చైతన్య సమావేశం కొరకు 2 రోజులు పాటు ఏప్రిల్ 8, 9 తేదీలలో శ్రీశైలంలో నిర్వహించడం కొరకు పెద్దలు నిర్ణయించడం జరిగింది. అందరూ ఏకరూప దుస్తులు, డ్రెస్కోడ్ మగవారు (తెల్ల చొక్కా తెల్లపంచె) ఆడవారు ఓనం చీరలు ధరిస్తారు. ఏప్రిల్ 8వ తేది బుధవారం 9 గంటలకు ప్రారంభం అయి 9వ తేది గురువారం సాయంత్రం 4.00 గం॥లకు సమావేశం పూర్తి అవుతుంది.

**మార్గదర్శనం చేయువారు:** ఆదరణీయ శ్రీ వి. భాగయ్య గారు, ఆర్.ఎస్.ఎస్. అఖిల భారత కార్యకారిణి, కలకత్తా.ఆదరణీయ శ్రీ మురళీధర్ జి. అఖిల భారత సీమా జాగరణ మంచ్ సంయోజక్ ఢిల్లీ పూజ్య శ్రీశ్రీశ్రీ శివస్వామి జి శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతులు అమరావతిపూజ్య శ్రీశ్రీశ్రీ శాంత భీష్మ చౌడప్ప స్వామి కర్ణాటక శ్రీ కోలంగారి పోలయ్య గారు సీమా జాగరణ మంచ్ 3 ప్రాంతాల సంయోజక్, నెల్లూరు...



# ఏప్రిల్ 12,13,14 తేదీలలో డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ ఉత్సవాలు.

**బేతంచెర్ల ఏప్రిల్ 9 (నందిపత్రిక )** నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో గత 25 సంవత్సరాల నుంచి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటూ వస్తున్నట్లు ఎంఎస్ఎఫ్ నాయకులు అనిల్ మాదిగ గురువారం ఓ ప్రకటన లో తెలిపారు. ఆయన మాట్లాడుతూ అలాగే ఈ సంవత్సరము జరిగే జయంతి వేడుకలను ఏప్రిల్ నెల 12,13, 14 తేదీలలో నిర్వహిస్తున్నామని అయన తెలిపారు.12వ తేది సాయంత్రం 7. గంటలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మూవీని తెర మీద వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.అంతేకాకుండా 13వ తేది ఉదయం 10 గంటలకు గ్రామంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ ని తల సేమియా చిన్నారుల కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు.

మొదటి బహుమతి 20 వేల రూపాయలు -స్పాన్సర్: మన బళ్లాని బ్రాండ్ అధినేత సూర్య బళ్ళారి రెండో బహుమతి 15 వేలు - స్పాన్సర్ : నంద్యాల బ్లడ్ డొనేషన్ అచ్చు బ్రదర్



మూడో బహుమతి 10 వేలు స్పాన్సర్: కీ"శే "బుక్కాపురం మద్దయ్య కీ "శే "బుక్కాపురం నాగ మద్దయ్య నాలుగో బహుమతి 6వేలు స్పాన్సర్ : 4 వేలు వల్లంపాటి వెంకటేశ్వర్లు 2వేలు శ్రీకృష్ణ ఈవెంట్స్ అధినేత రామకృష్ణ అలాగే సాయంత్రం నాలుగు గంటలకు గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ర్యాలీని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.14వ తేదీ ఉదయం 10 గంటలకు చిన్న పిల్లలకు వ్యాసరచన పోటీలు, ఆటలు పోటీలు ఉంటాయని ఆయన తెలిపారు.మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి స్పాన్సర్: ( పర్సనల్ గా )శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి టెంపుల్ ఈవో ఎం. రామాంజ నేయులు సాయంత్రం ఐదు గంటల నుండి స్టేజి కార్యక్రమాలు ముఖ్య అతిథితులచే ఉపన్యాసాలు మొత్తం స్టేజి కార్యక్రమాల్లో జరుగుతాయని అయన తెలిపారు.ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లాలో ఉన్నటువంటి అందరూ తరలివచ్చి విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు.ఆహ్వానించువారు: ఎఎసఎఫ్,ఎఎఫ్, అంబేద్కర్ యూత్ మరియు గ్రామ ప్రజలు. పూర్తి సమాచారం కొరకు : 9182890698 అనిల్ మాదిగ (మీఫీ నంద్యాల జిల్లా అధ్యక్షులు ) సంప్రదించ వలసినదిగా కోరారు.

# ఐడియథాన్ లో విద్యార్థులకు ప్రథమ బహుమతి




**బనగానపల్లె ఏప్రిల్ 9నందిపత్రిక** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బనగానపల్లెకు గర్వకారణంగా బి.ఎస్సి ఆనర్స్ జువాలజీ విద్యార్థులు విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సర్క్యులర్ ఎకానమీ ఐడియథాన్లో ప్రథమ బహుమతిని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. లలిత తెలిపారు. ఈ పోటీలను ప్రాజెక్ట్ డైరెక్టరేట్ పీఎం -ఉష , ఉన్నత విద్య కమిషనరేట్ మరియు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "ఆకృతి లైవ్ ట్రాక్" అనే జట్టు పేరుతో "అరటి నారతో శానిటరీ నాప్కిన్స్ తయారీ" అనే వినూత్న ప్రాజెక్టుతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పర్యావరణ హితమైనదిగా, తక్కువ ఖర్చుతో మహిళల ఆరోగ్య సంరక్షణకు అనుకూలమైన పరిష్కారాన్ని అందిస్తుందని విద్యార్థులు తెలియపరచడం తో విజేతలుగా నిలిచారని తెలిపారు.ఈ విజేతల బృందంలో టి. నాగ తారకేశ్వరి, ఎం. మయూరి ,కె. సుమలత రెడ్డి వీరు బి.ఎస్సి ఆనర్స్ జూలజీ విద్యార్థులు. ఈ ప్రాజెక్ట్కు బోటనీ విభాగం అధ్యాపకురాలు డా. జె. వసుంధరమ్మ మార్గదర్శకత్వం వహించారు. విజేతలకు ₹15,000 నగదు బహుమతి ప్రదానం చేయబడింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఎస్. లలిత ఆనందం వ్యక్తం చేస్తూ, విద్యార్థులు మరియు మార్గదర్శక అధ్యాపకురాలిని అభినందించారు. అలాగే విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ నిరంతరం సహకారం అందిస్తున్న ఉన్నత విద్య కమిషనర్ మరియు పీఎం -ఉష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ డా. నారాయణ భరత్ గుప్తా కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ విజయం విద్యార్థులలో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం మరియు పర్యావరణ బాధ్యతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది మరియు ,విద్యార్థులు విజేతలను అభినందించారు.

# రోజా నోరు అదుపులో పెట్టుకో లేదంటే నీకు మహిళలే బుద్ధి చెబుతారు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



**కర్నూలు ప్రతినిధి నంది పత్రిక** వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా నారా చంద్రబాబునాయుడు గురించి నారా లోకేష్ గురించి పవన్ కళ్యాణ్ గురించి నూటికి అడ్డు అదుపు లేకుండా మాట్లాడుతున్నారని అలాగే మాట్లాడితే రాష్ట్రంలో ఉండే మహిళలే నీకు గుణపాఠం చెప్తారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు గురువారం టిడిపి ఆఫీస్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి రోజా మీరు జబర్దస్త్ లో చేసినట్టు నిజ జీవితంలో కూడా చేస్తున్నారని అలా మాట్లాడితే జగన్మోహన్ రెడ్డి దగ్గర మెప్పు పొందుతావేమో కానీ మా దగ్గర కాదు కాబట్టి కూటమి నాయకుల మీద కానీ వారి కుటుంబాల మీద గాని నోటి దురుసుతో మాట్లాడుకోకుండా జాగ్రత్తగా ఉండాలని పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడే అర్హతగాని చంద్రబాబు నాయుడు గురించి మాట్లాడే అర్హతగాని నారో లోకేష్ గురించి మాట్లాడే అర్హతగాని మీకు లేదని ఇకపై ఎటువంటి కార్ కూతలు మాట్లాడకూడదని ఈసారికి నా మాట్లాడితే రాష్ట్ర ప్రజలే మీకు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు

# ముద్దవరం గ్రామం ఎస్సీ కాలనీలో మురుకునీటి సమస్యను పరిష్కరించిన న ఎంపీడీవో ఫజల్ రెహమాన్

**బేతంచెర్ల ఏప్రిల్ 9 (నందిపత్రిక )** బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామం ఎస్సీ కాలనీలో కల్వర్టులో పూడిక పేరుకొని, మురుగు నీరు రోడ్డు మీదకి ప్రవహించుచూ వృద్ధులు మరియు చిన్న పిల్లలు నడచుటకు ఇబ్బంది పడుతున్నారని వచ్చిన కంప్లైంట్ ను, ముద్దవరం స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో ఫజుల్ రెహమాన్ ఆదేశాల మేరకు, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ గ్రామస్తుల సహకారంతో, కల్వర్టులో ఉన్న సిల్టును తొలగించి, ట్రాక్టర్ మరియు టైరు సహాయంతో కల్వర్టు లోపల పూర్తిగా క్లియర్ చేయించడం జరిగినది. మరియు రోడ్డుపై ప్రవహించిన మురుగు నీరును పారిశుధ్య కార్మికుల సహాయంతో తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చెల్లించడం జరిగినది. సమస్యను పరిష్కరించేందుకు ఎస్సీ కాలనీ ప్రజలు ఎంపీడీవో గారికి ధన్యవాదాలు తెలపడం జరిగింది.



# వాడపల్లిలో అభివృద్ధి పనులు వేగవంతం...

### భక్తుల సౌకర్యాలే పరమావధిగా చర్యలు...
### సుమారు రూ.2.70 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...



**కొత్త పేట బ్యూరో చీఫ్ ఏప్రిల్ 9నంది పత్రిక** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యాలే పరమావధిగా అభివృద్ధి పనులను చేపట్టి, శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలియజేశారు. గురువారం వాడపల్లిలో పలు అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు, పాలకమండలి సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.94.50 లక్షలతో 200 కిలో లీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (వాటర్ ట్యాంక్ ) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.వాటర్ ట్యాంక్ నిర్మాణంతో గ్రామస్తులకు, భక్తులకు తాగునీటి ఇబ్బం దులు తప్పుతాయన్నారు.పార్కింగ్ ఇబ్బందులు తొలగించడానికి 8.88 సెంట్ల భూమిలో రూ.1.75 కోట్లతో ఫిల్లింగ్, లెవెలింగ్ చేసి ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.అనంతరం వాకులమాత అన్నదానం భవనం పనులను పరివేక్షించారు.



# గర్భవతులు, చిన్న పిల్లల తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలి :వైద్యాధికారి డాక్టర్ నరసింహ



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 9,నంది పత్రిక** గర్భవతులు, చిన్న పిల్లల తల్లులు పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా జీవిస్తారని ఆళ్లగడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నరసింహ, అంగన్వాడీ సూపర్వైజర్ దస్తగిరమ్మ తెలిపారు. గురువారం పట్టణ ఆరోగ్యకేంద్రంలో పోషన్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీ నుండి 23 వ తేదివరకు పోషన్ పక్వాడా కార్యక్రమం లో బాగంగా గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించా మన్నారు. అలాగే చిన్నపిల్లల తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చిన్నపిల్లలకు ప్లాస్టిక్ కవర్లలో నిల్వవించిన చిప్స్, కుర్కురే లాంటివి ఆహారంగా అందించకుండా, ఇళ్ళలో ఫ్రెస్ గా తయారు చేసిన ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు పోషకాహారంగా అందించా లన్నారు. అలాగే సెల్ ఫోన్ చూపిస్తూ పిల్లలకు ఆహారం తినిపించారాదని వాటివలన నష్టాలు ఉన్నాయన్నారు. పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా జీవించాలని వారు తెలిపారు. అనంతరం ఐరన్ , కాల్షియం మాత్రలు అందించి, వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు, చిన్నపిల్లల తల్లులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు కు ఘన నివాళి



**బనగానపల్లె ఏప్రిల్ 9నందిపత్రిక** సిపిఐ అగ్రనేత, భూ పోరాటాల యోధుడు అమరజీవి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 32వ వర్ధంతి సందర్భంగా గురువారం బన గానపల్లె సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ కృష్ణాజిల్లా దివి తాలుక మంగళాపురం గ్రామంలో ఉన్నత మైన కుటుంబం లో పుట్టి ఉన్నత చదువులు చదివి తన యావదాస్థిని పేద ప్రజలకు పంచి సర్వం అంకితం ఇచ్చి చల్లపల్లి జమీందార్ పై పోరు చేసి వేల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన భూ పోరాట యోధుడు చంద్రా రాజేశ్వరరావు గారు మరణ సమయం లో కూడా నేను ఏమి ఇచ్చేది లేదని ఎవ్వరికి బాకీ లేనని వున్నవి దుస్తులు పుస్తకాలు అని దుస్తులు ఆప్తులకు పుస్తకాలు పార్టీకి ఇచ్చి ఇస్తూ సెలవంటూ వెళ్లిపోయిన అమరజీవి కామ్రేడ్ చంద్రా రాజేశ్వరావు గారు అని కొనియాడారు అయన వారసులు గా అయన ఆశయాల కోసం కృషి చేస్తామని నివాళులు అర్పించారు ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డి సిపిఐ మండల సమితి సభ్యులు ఖాదర్ సుబ్బయ్య మహిళా సమాఖ్య మండల కార్యదర్శి స్వరూప నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు

# నద్దునూరి సమ్మయ్య సేవలు మరువలేనివి





## సిపిఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్

**కేసముద్రం, ఏప్రిల్ 09(నంది పత్రిక):**ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న సిపిఐ అభివృద్ధికి కృషి చేసిన అమరజీవి కామ్రేడ్ నద్దునూరి సమ్మయ్య సేవలు మరువలేనివని సిపిఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్ అన్నారు. గురువారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురంలోని స్థానిక కమ్యూనిటీ హాల్ లో సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ విద్యాకమిటీ చైర్మన్, అమరజీవి కామ్రేడ్ నద్దునూరి సమ్మయ్య 20వ వర్ధంతి సందర్భంగా సమ్మయ్య చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంద భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతి సభలో చొప్పరి శేఖర్, ఎన్.ఎ స్టాలిన్, వెల్పుగొండ ఆనంద్, జన్ను కట్టయ్య, దండు కొమురయ్య, వెల్పుగోండ ఏలీయా పలువురు వ్యక్తులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్ మాట్లాడుతూ సమ్మయ్య మరణానికి ముందు కేసముద్రం మండలంలో పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ, ఈ ప్రాంతంలో భూస్వామ్య వ్యతిరేక విధానాలపై పోరాడిన గొప్ప వ్యక్తి సమ్మయ్య అన్నారు. భూ పోరాటాలు, ప్రజా పోరాటాలలో తన వంతు పాత్ర పోషించి తనకంటూ పేరు సంపాదించుకొని, అనేక ఉద్యమాలలో చెరగని ముద్ర వేసుకున్న గొప్ప వ్యక్తి సమ్మయ్య అన్నారు. అమీనాపురం ప్రాంతంలో సిపిఐ ఉద్యమ నిర్మాణంలో ప్రధాన పాత్ర నద్దునూరి సమ్మయ్యదే అని చెప్పక తప్పదన్నారు. సమ్మయ్య ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళులన్నారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు వెల్పుగొండ ఆనంద్, జన్ను కట్టయ్య, దండు కొమురయ్య, వెల్పుగోండ ఏలీయా లు మాట్లాడుతూ అమీనాపురం ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాల్ స్థలం అన్యాక్రాంతం కాకుండా పోరాటం చేసిన వ్యక్తి సమ్మయ్య అని, సమ్మయ్య పోరాటం నేటి సమాజానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్,

సిపిఐ నాయకులు మంద భాస్కర్, కాసు సాయి, గ్రామ పెద్దలు వెల్పుగోండ ఆనంద్, జన్ను కట్టయ్య, దండు కొమురయ్య, దండు సురేందర్, అంబేద్కర్ యువజన సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెల్పుగోండ ఏలీయా, కట్కూరి ప్రేమ్ కుమార్, జన్ను శ్రీను, దండు బాబు, జన్ను చంటి, ముల్లి శివ, సమ్మయ్య భార్య నద్దునూరి వెంకటమ్మ, కుమారుడు నద్దునూరి సారంగం, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కను సన్మానించిన జిల్లా అధికార ప్రతినిధి అంబటి



**కేసముద్రం, ఏప్రిల్ 09(నంది పత్రిక):** మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ నూతన అధికార ప్రతినిధిగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్, కేసముద్రం మండల నాయకులతో కలిసి హామీ ఇచ్చారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కను మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ క్యాంప్ కార్యాలయంలో కేసముద్రం మండల నాయకులతో కలిసి, శాలువాతో సన్మానించారు. మహబూబాబాద్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినందుకు మంత్రి సీతక్కకు, ఎమ్మెల్యే మురళి నాయక్ లతో పాటు సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మున్సిపల్ కౌన్సిలర్ తరాల వీరేష్, ఇనుగుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, మాజీ జడ్పీటీసీ కదిరే సురేందర్, ధన్నసరి మాజీ సింగిల్ విండో చైర్మన్ బండారు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# పి.ఆర్.సి తోపాటు పెండింగ్ లో ఉన్న డి.ఏలు వెంటనే ప్రకటించాలి.

## టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు గుండు సురేందర్ డిమాండ్.

**కేసముద్రం, ఏప్రిల్ 09(నంది పత్రిక):**ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న అన్ని డి.ఏ లను వెంటనే ప్రకటించాలని, మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పీఆర్సీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల అధ్యక్షులు గుండు సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కేసముద్రం స్టేషన్ ఉన్నత పాఠశాలలో టిపిటిఎఫ్ కేసముద్రం మండల అధ్యక్షులు గుండు సురేందర్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి మండల అధ్యక్షులు గుండు సురేందర్ మాట్లాడుతూ మారుతున్న జీవన ప్రమాణాలను, ధరలను, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒక డీ.ఏను, ఐదు సంవత్సరాలకు ఒకసారి పిఆర్సిని ప్రకటిస్తుంది, కానీ ఆర్థిక మాంద్యాన్ని సాకుగా చూపించి ఏళ్లు గడిచినా పి.ఆర్.సి, డి.ఏ లను ఇంకా ఆలస్యం చేస్తూ ఉద్యోగ ఉపాధ్యాయులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. ఇది సరైన పద్ధతి కాదని, తక్షణమే వీటి అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఉపాధ్యాయులు 30-35 సంవత్సరాలు విద్యార్థులకు సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులకు రిటైర్ అయిన రోజే గ్రాట్యుటీ, పీఎఫ్, పెన్షన్ మొదలైన అన్ని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పూర్తిగా చెల్లించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బెనిఫిట్స్ ని తక్షణమే మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల ఆరోగ్య భద్రత కోసం ఇటీవలే ప్రభుత్వం ప్రారంభించిన హెల్త్ కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలని, వాటి వినియోగంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని, ఏ కార్పొరేట్ ఆస్పత్రిలో అయినా అన్ని రకాల నగదు రహిత వైద్యం అందేలా రూపొందించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ భద్రత, జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నా, వారి జీవితాలను అగమ్యగోచరం చేస్తున్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి వారి కుటుంబాలలో వెలుగులు నింపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి నరసింహ రాజు, జిల్లా కార్యదర్శి చీకటి వెంకట్రాం నర్సయ్య, ఉపాధ్యక్షులు కొమ్ము రాజేందర్, అంజన్న, కార్యదర్శులు ఊట్కూరు ప్రణయ్ కుమార్, వీసం నర్సయ్య, మోహనకృష్ణ, బొల్లెద్దు చందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.శ్రీనివాస్ అకాడమిక్ సెల్ కన్వీనర్ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఏఓ వెంకన్న



**కేసముద్రం, ఏప్రిల్ 09(నంది పత్రిక):**మొక్కజొన్నలు మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే రైతులు ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాలను పాటించి తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని మండల వ్యవసాయాధికారి వెంకన్న అన్నారు. గురువారం కేసముద్రం మండలం వ్యవసాయ మార్కెట్ లోని ప్రభుత్వం మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ధనసరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో జి.మల్లారెడ్డితో కలిసి పరిశీలించారు. రైతులు మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు సెంటర్ కు తీసుకొచ్చేటప్పుడు 14 శాతం లోపు తేమ వచ్చేటట్టుగా చూసుకొని మట్టి పెళ్ళలు, తాలు, చెత్తా చెదారం, బూజు పట్టని నాణ్యమైన మొక్కజొన్న ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర క్వింటాకు రూ.2400 పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వి.లావణ్య సెంటర్ ఇంచార్జీలు, రైతులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.

## జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ స్నేహ శబరీష్.

**మహబూబాబాద్, ఏప్రిల్ 09(నంది పత్రిక):** గురువారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో పోలీసు, జాతీయ రహదారుల విభాగం, మున్సిపాలిటీ, పీఆర్ తదితర శాఖల అధికారులతో రహదారి భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో పాటు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ గత కమిటి సమావేశంలో కమిటి దృష్టికి వచ్చిన అంశాలు ఇచ్చిన ఆదేశాలు ఎంతవరకు అమలు అయ్యాయో అధికారులను ప్రశ్నించారు. జాతీయ రహదారిపై గుర్తించిన బ్లాక్ స్పాట్, ప్రమాదం జరిగే ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై ఇచ్చిన సూచనలు ఎంతవరకు పూర్తి చేశారని జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. అనవసరపు యు టర్న్ లను తగ్గించాలని సూచించారు. అదేవిధంగా జాతీయ రహదారులపై రాంగ్ రూట్లో వచ్చే వారిని కట్టడి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వెళ్లే ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ రోడ్లపై ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు సంబంధిత పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చేపట్టాల్సిన చర్యలపై కమిటీకి ప్రతిపాదనలు సిఫారసు చేయాలని సూచించారు. ప్రస్తుతం పోలీస్ అధికారులు సిఫారసు చేస్తున్న ప్రతిపాదనలను వచ్చే కమిటీ సమావేశం నాటికి పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. అవసరమున్న చోట రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాలలో హెచ్చరిక బోర్డు, జరుగకుండా ఉండడానికి వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ బ్రేకర్స్ లాంటివి పెట్టాలన్నారు. పాఠశాలల వాహనాల ఫిట్ నెస్ లను, డ్రైవర్ల లైసెన్స్ లను పరిశీలించాలన్నారు. జిల్లా స్థాయిలో అధికారులతో రోడ్ ఇన్స్ పెక్షన్ బృందాన్ని తయారు చేయాలని, అట్టి బృందం రహదారుల భద్రత విషయంలో తీసుకున్న నిర్ణయాలకు, జరిగిన పనులను పరిశీలిస్తారన్నారు. అదేవిధంగా గ్రామ స్థాయిలో కూడా గ్రామ స్థాయి రోడ్డు భద్రత కమిటీని నియమించి అందులో ప్రజాప్రతినిదులు, యువకులు, మహిళలు, అన్ని శాఖల అధికారులతో గ్రామంలోని సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు పనిచేస్తుందన్నారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎస్.పి డాక్టర్ శబరీష్ రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన పలు చర్యలపై సూచనలు చేశారు. ట్రాఫిక్ రూల్స్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, జిల్లాలో రవాణా, పోలీసు శాఖ అధికారులు ట్రాఫిక్ రూల్స్ అమలుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అధిక లోడుతో ప్రయాణించే ఆటో రిక్షాలు, బైక్ లపై ముగ్గురు ప్రయాణించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో, మున్సిపల్ పరిధిలలో ప్రముఖమైన వ్యక్తులతో రహదారి భద్రతపై ప్రచారాన్ని చేయించాలని, సమావేశాలు నిర్వహించాలన్నారు. మున్సిపల్ పరిధిలలో జరిగే వార్డు సభలలో స్థానికంగా పోలీసు అధికారుల సలహా సూచనలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థలు, రెవెన్యు అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె.అనిల్ కుమార్, అడిషనల్ ఎస్.పి తిరుపతి రావు, జాతీయ రహదారుల విభాగం, మున్సిపాలిటీ, పీఆర్, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మరణం లేని మహనీయుడు అన్న ఎన్టీఆర్.





## సంక్షేమ పథకాలకు ఆద్యుడు అన్న ఎన్టీఆర్.

## అమరావతికి మద్దతు ఇవ్వని వైసీపీని భూస్థాపితం చేయండి.

## ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

## మైలవరంలో అన్న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ.

## భారీ ర్యాలీతో జనసంద్రంగా మారిన మైలవరం

**మైలవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 9 నంది పత్రిక** మరణం లేని మహనీయుడు అన్న ఎన్టీఆర్ గారు అని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. మైలవరంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు జన్మదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని అన్న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు చేత భారీ కేకును అభిమానులు కట్ చేయించారు. భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. ముందుగా జిల్లా పరిషత్తు హైస్కూలు వద్ద నుంచి తారకరామ నగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు తో పాటు, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) , ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనూరాధ , మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, పాల్గొన్నారు. జోహార్ ఎన్టీఆర్, జై టీడీపీ, జై చంద్రబాబు అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ "సంక్షేమ పథకాల అమలుకు ఆద్యుడు అన్న ఎన్టీఆర్ పేదల అభ్యున్నతికి అన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోనే వివిధ రాష్ట్రాలకు మార్గదర్శనమయ్యాయి. ప్రస్తుతం పేదలకు రూ.4 నుంచి 15 వేల వరకు లభిస్తున్న పింఛన్ పథకాన్ని ప్రవేశ పెట్టింది అన్న ఎన్టీఆర్.పేదలకు పింఛన్ పథకం అన్న ఎన్టీఆర్ ఆలోచనల్లో నుంచి ఉద్భవించినదే. సీఎం చంద్రబాబు , మంత్రి లోకేష్ ఆయన ఆశయాలు పుణికి పుచ్చుకుని తెలుగుదేశం పార్టీని నడిపిస్తున్నారు.అన్న ఎన్టీఆర్ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ ప్రజలకు సేవలు అందిస్తోంది. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అన్న ఎన్టీఆర్ గారు పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు. అన్న ఎన్టీఆర్ ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలందరి హృదయాల్లో చిరస్థాయిగా ఆయన చెరగని ముద్ర వేసుకున్నారు.అమరావతి రాజధాని ఆంధ్రుల కల. సీఎం చంద్రబాబు గారు కూటమి ప్రభుత్వం కృషితో చట్టబద్ధత లభించింది. ఏబీన్ రాధాకృష్ణ ఏమి తప్పు మాట్లాడలేదు. జగన్మోహన్ రెడ్డి చెప్పిన 'మావిగన్' నుంచి దృష్టి మరల్చుడానికి సిగ్గులేకుండా పత్రికా కార్యాలయంపై దాడులు చేస్తున్నారు. బ్లూ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నీలిమీడియాను బహిష్కరించండి. అమరావతికి మద్దతు ఇవ్వని వైసీపీని భూస్థాపితం చేయండి. " అని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) బీజేపీ మైలవరం నియోజకవర్గ ఇంచార్జి నూతులపాటి బాలకొటేశ్వరరావు (బాల) తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





నంది పత్రిక

శుక్రవారం 10 - 04 -2026

# ఒక యుద్ధం..అనేక చేదు అనుభవాలు !

ట్రంప్, నెతన్యాహులు కలిసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరా÷– నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహరైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాలంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు ర్మూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే ర్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణ మైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

# నారీశక్తి కోసం నిలబడాల్సిన తరుణం!

మరికొన్ని రోజుల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో పండుగల సందడి మొదలవబోతున్నది. అస్సాం ప్రజలు రొంగాలి బిహు జరుపుకొంటే, ఒడిశా ప్రజలు మహా బిషుబ పాన సంక్రాంతి జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్లో పొయిలా బైశాఖ్ బెంగాలీల నూతన సంవత్సరానికి నాంది పలికితే, కేరళలో విషు పండుగను సంబరంగా చేసుకుంటారు. తమిళనాడులో పుత్తాండు పర్వదినాన్ని, పంజాబ్‌తోపాటు ఉత్తర భారతంలోని ఇతర ప్రాంతాల్లో బైశాఖీ వేడుకను చేసుకుంటారు. ఇవన్నీ ఆశాభావాన్ని, సానుకూల దృక్పథాన్ని పెంపొందించే పండుగలు. దేశవిదేశాల్లో ఈ పండుగలు జరుపుకొనే వారందరికీ నా శు భాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ పవిత్ర వేడుకలు అందరి జీవితాల్లో ఆనందాన్నీ, సౌభాగ్యాన్నీ తీసుకురావాలని కోరుకుంటున్నాను. వీటితోపాటు, ఏప్రిల్ 11 నుంచి మహాత్మా పూలే 200 జయంతి ఉత్సవాలు కూడా మొదలవుతున్నాయి. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా యావత్ భారతదేశం ఆయనకు నివాళి అర్పించబోతున్నది. మన మనసులనూ, ఆలోచనలనూ నూతన స్ఫూర్తితో నింపివేసే ఈ ప్రత్యేక సందర్భాలతోపాటు, మన దేశం మరో చరిత్రాత్మక సందర్భానికి సిద్ధమవుతున్నది. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్టం చేయడానికి, సమానత్వం పట్ల మన నిబద్ధతను నొక్కి చెప్పడానికి లభించిన గొప్ప అవకాశమిది. మహిళల రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించేందుకు, ఆమోదించేందుకు ఏప్రిల్ 16న పార్లమెంటు సమావేశమవుతున్నది. దీనిని ఓ శాసన సంబంధమైన కార్యక్రమంగా భావిస్తే ఈ బిల్లు ప్రాధాన్యాన్ని తగ్గించినట్టే! దేశంలోని కోట్లాది మంది మహిళల ఆకాంక్షలకు ఇది ప్రతిబింబం. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన చిరకాల నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనం. మన దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే ఉన్నారు. వారు ఈ దేశానికి అందిస్తున్న సేవలు అపారం, అమూల్యం. ప్రతి రంగంలోనూ మహిళలు సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు దేశమంతా గర్వపడుతున్నది. శాస్త్ర, సాంకేతిక రంగాలు మొదలుకొని ఔత్సాహిక పారిశ్రామిక రంగం వరకు, క్రీడల నుంచి రక్షణ బలగాల వరకు, సంగీతం నుంచి కళల వరకు దేశాభివృద్ధిలో మహిళలు ఎంతో కీలకంగా ఉన్నారు. గత కొన్నేళ్లుగా స్థిరంగా కొనసాగుతున్న అనేక ప్రయత్నాల వల్ల మహిళా సాధికారతకు సానుకూలమైన వాతావరణం ఏర్పడింది. చదువుకునేందుకు అవకాశాలు విస్తృతం కావటం, ఆరోగ్యసేవలు మెరుగుపడటం, సంపద సృష్టిలో సమాన భాగస్వామ్యం, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావటం... ఈ మార్పుల వల్ల ఆర్థిక, సామాజిక జీవితాల్లో మహిళల వంతు పెరిగింది. కానీ, సమాజంలో పెరుగుతున్న ఈ మహిళా భాగస్వామ్యానికి అనుగుణంగా రాజకీయ రంగంలోనూ, శాసనసభల్లోనూ వారి ప్రాతినిధ్యం పెరగలేదు. ఇది ఎంతో దురదృష్టకరం, ఎందుకంటే పాలనలోనూ, నిర్ణయాధికారంలోనూ మహిళలు పాలుపంచుకొన్నప్పుడు వారిదైన ఆలోచనలతోనూ, అనుభవాలతోనూ సామాజిక చర్చలు మరింత నిశితమవుతాయి, పాలనా సామర్థ్యం మరింత బాగుపడుతుంది. 2029లో లోక్‌సభకు, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగే నాటికల్లా మహిళా రిజర్వేషన్లు అమలులోకి రావటం అనివార్యం. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు దక్కాల్సిన ప్రాధాన్యాన్ని దక్కేలా చేసేందుకు గత ప్రభుత్వాలు దశాబ్దాలుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. కమిటీలు ఏర్పాటయ్యాయి. ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో మాత్రం అందరికీ ఏకాభిప్రాయం ఉంది. ఈ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే 2023 సెప్టెంబరులో నారీ శక్తి వందన్ అధినియమ్‌ను పార్లమెంటు ఆమోదించింది. నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సందర్భాల్లో ఒకటిగా నేను దీన్ని భావిస్తాను. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ సందర్భం మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైనది. సమానత్వం అత్యున్నత విలువగా ఉన్న సమాజాన్ని నిర్మించాలని మన రాజ్యాంగ నిర్మాతలు, ముఖ్యంగా రాజ్యాంగ పరిషత్తులోని మహిళా సభ్యులు, ఆకాంక్షించారు. శాసన వ్యవస్థల్లో మహిళల పాత్రను బలోపేతం చేయడమన్నది ఈ ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ఒక కీలకమైన ముందడుగు. దేశ భవిష్యత్తును మలచడంలో ప్రతి పౌరుడికీ సమానమైన అవకాశముండే సమాజాన్ని ఏర్పాటు చేసే దిశగా మా చిత్తశు ద్ధికి ఇది తార్కాణం. ఇది ఇక ఎంతమాత్రమూ వాయిదా వేసేందుకు వీల్లేని విషయం. మహిళల సమాన ప్రాతినిధ్యాన్ని బలపరచటంలో జరిగే ఏ ఆలస్యమైనా, అది మన ప్రజాస్వామ్యాన్ని సమానత్వ స్ఫూర్తి దిశగా తీసుకువెళ్ళటంలో జరిగే ఆలస్యం కిందే లెక్క! శాసన వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని దశాబ్దాల క్రితమే గుర్తించారు, దానిపై చర్చలు జరిపారు, అది తప్పనిసరి కర్తవ్యంగా నిర్ధారించారు. ఇప్పుడు ఇంకా ఈ విషయంపై ఒక చర్య తీసుకోవటంలో ఆలస్యం జరిగితే, మనం ఇప్పటికే గుర్తించిన, సరిదిద్దగలిగిన వివక్షను మరింతకాలం కొనసాగించినట్టే అవుతుంది. మన దేశం ఒక నిర్దిష్ట లక్ష్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు అడుగు వేస్తున్న ఈ తరుణంలో, దేశంలోని అన్ని వ్యవస్థలూ ఇక్కడి సమస్త పౌరుల, ముఖ్యంగా జనాభాలో సగభాగంగా ఉన్న మహిళల, ఆకాంక్షలను ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు తక్షణం ఈ చర్య చేపట్టడం వల్ల ఎంతోకాలంగా పూచీపడి ఉన్న వాగ్దానాలు నెరవేరడమే కాదు, అభివృద్ధి వైపు సాగుతున్న వేగం కూడా నెమ్మదించకుండా అలాగే కొనసాగుతుంది. మన ప్రజాస్వామ్యాన్ని మరింత సమాన ప్రాతినిధ్యం కల్పించేదిగా, స్పందించేదిగా, భవిష్యత్తుకు అనుగుణమైనదిగా తీర్చిదిద్దేందుకు ఇది ఒక చరిత్రాత్మకమైన అవకాశం. ఇప్పుడు సమిష్టి కార్యాచరణకు సమయం ఆసన్నమైంది. ఇది ఏ ఒక్క ప్రభుత్వానికో, పార్టీకో లేదా వ్యక్తికో సంబంధించిన విషయం కాదు. దేశం మొత్తం ఈ అంశంలో ముందడుగు ఎంత ముఖ్యమో గుర్తించాలి, దీన్ని సాకారం చేయటానికి ఏకం కావాలి. మన దేశ నారీశక్తికి ఇదే మనం చేయగలిగింది. అందుకే మహిళా రిజర్వేషన్ బిల్లుకు లభించే ఆమోదంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం కావాలి. జాతీయ ప్రయోజనాలే పరమావధి కావాలి. ఇది మనం మన కోసం కాక, మన భావి తరాల కోసం పని చేసే సదవకాశం లభించిన సందర్భం. మార్పులను స్వీకరిస్తూ, మరింత సమ్మిళితత్వాన్ని సాధించడంలోనే అసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి దాగి ఉందన్న సంగతిని గుర్తు చేసే సందర్భం. చరిత్రాత్మకమైన ఈ పార్లమెంటు సమావేశం సమీపిస్తున్న నేపథ్యంలో భారతీయ మహిళల కోసం చేపడుతున్న ఈ ముఖ్యమైన కార్యక్రమానికి మద్దతు అందించాలని పార్టీలకు అతీతంగా పార్లమెంటు సభ్యులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని బాధ్యతగా వ్యవహరించేందుకు ముందుకు వద్దాం. అత్యున్నత ప్రజాస్వామ్య విలువల కోసం కలిసి నడుద్దాం. జాతీయ ప్రయోజనాల విషయంలో విభేధాలను పక్కన పెట్టి, కలిసికట్టుగా పనిచేయగలదని భారత్ ఎప్పుడూ రుజువు చేసుకుంటూనే ఉన్నది. ఇది అలాంటి సందర్భమే. అందరం కలసికట్టుగా ముందుకు సాగుదాం. రాజ్యాంగ విలువలను బలోపేతం చేద్దాం.

## పాక్‌ను ముందు పెట్టి అమెరికా నాటకం

40 రోజుల పాటు కొనసాగిన యుద్ధానికి తెర దించుతూ అమెరికా, ఇరాన్ దేశాలు రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో రెండు దేశాల మధ్య రాజీ కుదిరింది. రెండు దేశాల మధ్య రాజీ కుదర్చటాన్ని పాకిస్థాన్ గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. తనను తాను శాంతిదూతగా చెప్పుకుంటోంది. ఇలాంటి సమయంలో బ్రిటన్‌కు చెందిన ది ఫైనాన్షియల్ టైమ్స్ న్యూస్ పేపర్ సంచలన కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ప్రకారం.. అమెరికా ఒత్తిడి కారణంగానే పాకిస్థాన్ మధ్యవర్తిత్వం చేయడానికి ముందుకు వచ్చింది. ఇరాన్, అమెరికాల మధ్య రాజీ కుదిరితే హోర్ముజ్ జలసంధి మళ్లీ తెరుచుకుంటుందని అమెరికా భావించింది. అందుకే ఇరాన్‌ను యుద్ధం ఆపేలా ఒప్పించమని పాకిస్థాన్‌ను కోరింది. గత కొన్ని వారాల నుంచి ట్రంప్ ప్రభుత్వం పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచింది. అమెరికా ఒత్తిడి కారణంగానే బలవంతంగా ఇరాన్‌తో చర్చలకు పాకిస్థాన్ ఒప్పుకుంది. ఎంతో కష్టం మీద ఇరాన్‌ను రాజీకి ఒప్పించింది. అమెరికాకు సంబంధించినంత వరకు పాకిస్థాన్ మధ్యవర్తి కాదు.. ఇరాన్‌తో సంధి చేసుకోవడానికి ఓ మార్గం మాత్రమేనని ది ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. ఇజ్రాయెల్ కారణంగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విఫలం అయ్యేలా ఉంది. ఇజ్రాయెల్ లెబెనాన్‌పై మిస్సైల్ దాడులు చేసింది. ఈ దాడుల్లో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మళ్లీ మూసి వేసింది. దీంతో ట్రంప్ ఆగ్రహానికి గురయ్యారు. గురువారం ది ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. 'అమెరికా ఈజ్ బ్యాక్. ఇప్పటికే బలహీనపడిన శత్రువును పూర్తిగా నిర్మూలించేందుకు సిద్ధంగా ఉన్నాం. హోర్ముజ్‌ను తెరవకపోతే దాడులు తప్పవు. ఒప్పందం కుదరకపోతే ఈసారి తీవ్రమైన దాడులు చేస్తాం. ఎన్నడూ లేని విధంగా ఇరాన్‌పై విరుచుకుపడతాం. ఇప్పటికే ఇరాన్ చుట్టూ అమెరికా బలగాలున్నాయి. అణ్వాయుధాలను ఇరాన్ వదలాల్సిందేనని రాసుకొచ్చారు. అయితే ఇరాన్ కూడా పట్టుదలగానే ఉంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ మరోసారి హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. అమెరికా, ఇరాన్‌లు బుధవారం రెండు వారాల కాల్పుల విరమణను ప్రకటించాయి. దీనిలో భాగంగా, ప్రపంచ ఇంధన సరఫరాలను పునరుద్ధరించేందుకు వీలుగా హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. అమెరికా తీసుకున్న నిర్ణయానికి ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు మద్దతు తెలిపారు. అయితే లెబనాన్‌తో కాల్పుల విరమణ ఉండదని చెప్పారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. పది నిమిషాల వ్యవధిలో లెబనాన్‌లోని ప్రలు ప్రాంతాలపై సుమారు 100 ఎయిర్ స్ట్రైక్స్ర చేసింది. ఈ దాడుల్లో దాదాపు 180 మంది ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది.

# తాత్కాలిక కాల్పుల విరమణ జరిగినా..

### సైనిక బలగాలు ఇరాన్ చుట్టూ కొనసాగుతాయి

### స్పష్టం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ పూర్తిగా ఒప్పందాన్ని అమలు చేసే వరకు అమెరికా సైనిక బలగాలు అక్కడే కొనసాగుతాయని తెలిపారు. ఇరాన్–అమెరికా మధ్య బుధవారం రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ తమ దేశానికి చెందిన యుద్ధ నౌకలు, విమానాలు, సైనికులు, ఆయుధాలు మొదలైనవి ఇరాన్ పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయని ట్రంప్ పేర్కొన్నారు .యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తి స్థాయి ఒప్పందం అమలయ్యేంత వరకు సైనికులు వెనక్కి రారని ట్రంప్ తెలిపారు. ఒకవేళ ఒప్పందాన్ని ఇరాన్ పాటించకపోతే మునుపెన్నడూ చూడని స్థాయిలో విరుచుకుపడతామని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి మార్గం సురక్షితంగా ఉండాలని, నౌకాయానం నిరంతరం కొనసాగాలని అన్నారు. ఒప్పందం కుదిరేవరకు అమెరికా సైన్యం అక్కడే విశ్రాంతి తీసుకుంటూ, తమ తదుపరి మిషన్ కోసం ఎదురుచూస్తుందన్నారు. మరోవైపు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు భారీగా కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం 254 మంది మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. 1,100 మందికి పైగా గాయపడ్డారని సమాచారం. ముఖ్యంగా బీరుట్, దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లో నష్టం మరింత తీవ్రంగా ఉందని వార్తలు వస్తున్నాయి.

### పాకిస్థాన్‌పై మాకు నమ్మకం లేదు

### ఇజ్రాయిల్ రాయబారి రూవెన్ అజార్ సంచలన వ్యాఖ్యలు

అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు పలికిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఒప్పందంలో మధ్యవర్తిత్వ పాత్ర పోషించిన పాకిస్థాన్‌పై తమకు నమ్మకం లేదని ఆ దేశ రాయబారి పేర్కొన్నారు. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ తాజాగా మాట్లాడుతూ.. శాంతి చర్చల్లో పాక్ పాత్రపై సందేహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం ఆ దేశాన్ని మధ్యవర్తిగా ఉపయోగించు కోవాలని నిర్ణయించుకుందని తాను భావిస్తున్నట్టు అజార్ పేర్కొన్నారు. ఏదేమైనా ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు అమెరికాతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అమెరికా–మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ మద్దతు ఇస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఇరాన్ వరకే పరిమితం అని, లెబనాన్‌పై తమ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ రాయబారి వెల్లడించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా తొలగించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# నెతన్యాహూకు స్వదేశంలో తీవ్ర వ్యతిరేకత

### కాల్పుల విరమణ ..రాజకీయ వైఫల్యం

### ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్ విమర్శలు

యుద్ధ లక్ష్యాలను సాధించడంలో ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు విఫలమయ్యారని ఇజ్రాయెల్ ప్రతిపక్ష నాయకులు విమర్శలు గుప్పించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్.. కాల్పుల విరమణ ఒప్పందాన్ని, ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఆక్షేపించారు. ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని రాజకీయ వైఫల్యంగా అభివర్ణించారు. యుద్ధ లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు తీవ్రంగా విఫలమయ్యారని, ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ భద్రతకు ప్రమాదకరమని యైర్ లాపిడ్ పేర్కొన్నారు. 'మన చరిత్రలో ఇంతటి రాజకీయ విపత్తు ఎన్నడూ జరగలేదు. అహంకారం, నిర్లక్ష్యం, వ్యూహాత్మక ప్రణాళిక లేకపోవడం వల్ల నెతన్యాహు కలిగించిన రాజకీయ, వ్యూహాత్మక నష్టాన్ని పూడ్చడానికి మనకు సంవత్సరాలు పడుతుంది' అని ట్వీట్ చేశారు. సైన్యం తమకు అప్పగించిన పనులన్నీ పూర్తి చేసిందని, ప్రజలు కూడా అద్భుతమైన స్థైర్యాన్ని ప్రదర్శించారని, అయితే నెతన్యాహు రాజకీయంగా, వ్యూహాత్మకంగా విఫలమయ్యారని విమర్శించారు. తాను నిర్దేశిరచుకున్న లక్ష్యాలలో దేనినీ నెతన్యాహు సాధించలేకపోయారన్నారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్మూలించడం లేదా తీవ్రంగా దెబ్బతీయడాన్ని నెతన్యాహు యుద్ధానికి ప్రధాన లక్ష్యంగా నిర్దేశిరచారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్‌కు అస్తిత్వ ముప్పుగా అభివర్ణించారు. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యాలను నిర్వీర్యం చేయాలని, ఇరాన్ పాలనను బలహీనపరచాలని, దాని మిత్ర బృందాల నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకోవాలని నెతన్యాహు లక్ష్యాలుగా పెట్టుకున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు దారుణంగా విఫలమయ్యారని మాజీ ప్రధాని నాఫ్తాలి బెన్నెట్ విమర్శించారు. 'నాయకత్వం మనకు భ్రమలు కల్పించింది. వారి వాగ్దానాలన్నీ ఈ రాత్రి మన మొహం మీదే పేలిపోయాయి' అని బెన్నెట్ ట్వీట్ చేశారు. ఈ ఒప్పందం రాబోయే సంవత్సరాల పాటు ఇజ్రాయెల్ భద్రతను ప్రమాదంలో పడేసే ఒక సంపూర్ణ వైఫల్యం అని అభివర్ణించారు.

# ఐదు రోజుల జోరుకు బ్రేక్... భారీ నష్టాల్లో మార్కెట్లు

గత ఐదు రోజులుగా లాభాల జోరు చూపిన దేశీయ స్టాక్ మార్కెట్లకు గురువారం బ్రేక్ పడింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న చమురు ధరలు, అమెరికా–ఇరాన్ కాల్పుల విరమణపై నెలకొన్న అనిశ్చితి ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపగా, సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. వివరాల్లోకి వెళితే, సెన్సెక్స్ 931.25 పాయింట్లు పతనమై 76,631.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 222.25 పాయింట్లు నష్టపోయి 23,775.10 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సెషన్ ఆద్యంతం అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, లార్సెన్ అండ్ టుబ్రో వంటి దిగ్గజ షేర్లు ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. ప్రధాన సూచీలు బలహీనపడినప్పటికీ, బ్రాడర్ మార్కెట్లు మాత్రం కొంత నిలకడగా ఉన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.25 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 0.20 శాతం చొప్పున స్వల్ప లాభాలతో ముగియడం గమనార్హం. రంగాల వారీగా చూస్తే, బ్యాంకింగ్ షేర్లు మార్కెట్‌ను కిందికి లాగాయి. మరోవైపు, మెటల్ స్టాక్స్ కొంత మద్దతునిచ్చి టాప్ గెయినర్‌గా నిలిచింది. అమెరికా పట్ల తీవ్ర అవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘలీబాఫ్ చేసిన వ్యాఖ్యలు మార్కెట్లలో ఆందోళన పెంచాయి. కాల్పుల విరమణ ఒప్పందాలను అమెరికా పదేపదే ఉల్లంఘిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ పరిణామాలతో ఐదు రోజులుగా కొనసాగుతున్న రూపాయి ర్యాలీకి కూడా బ్రేక్ పడింది. టెక్నికల్ పరంగా నిఫ్టీ 23,600 స్థాయికి దిగువకు పడిపోతే మరింత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com